

పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 13 సంచిక : 65 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 7 నవంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :65 PAGES :8 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : VISAKHAPATNAM SAT 7 NOVEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

పరిషత్ పోరులో గెలుపెవరిది?

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం..

365 కేంద్రాల్లో భారీ ఏర్పాట్లు!

పెన్ పవర్ డెస్క్: ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీపడ్డ వేల మంది అభ్యర్థుల భవితవ్యం మరి కొన్ని గంటల్లో తేలనుంది. పోలింగ్ ప్రక్రియ ఎంత సజావుగా సాగిందో.. అంతకంటే క్రమ పద్ధతిలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు 28 జిల్లాల్లో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో దాదాపు 30 వేల మందికి పైగా సిబ్బంది ఈ కౌంటింగ్ ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొంటారు. వేల సంఖ్యలో పోలీసు బందోబస్తు కూడా

- మిగతా 2లో



విక్రమ్ రెడ్డి వంద మందితో వచ్చి బూత్ క్యాప్చరింగ్‌కు యత్నించారు

- స్థానిక ఎన్నికల తీరుపై వైసీపీకి మంత్రి ఆనం చురకలు
- బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహిస్తున్నామన్న ఆనం
- తన సహనాన్ని చేతకానితనంగా చూడొద్దని విక్రమ్ రెడ్డికి హెచ్చరిక



- మిగతా 2లో



- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయి పర్యటన
- నీట మునిగిన పొలాల్లో నడుస్తూ, పంట నష్టాన్ని స్వయంగా అంచనా
- రాత్రి పగలు సమీక్షలు, టెలికాన్ఫరెన్సులతో యంత్రాంగాన్ని అప్రమత్తం
- తుఫాను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా
- యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ, సహాయక చర్యల పర్యవేక్షణ

- మిగతా 2లో



సచివాలయంలో సమీక్షలు, టెలికాన్ఫరెన్సులకే పరిమితం కాకుండా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా పాలం గట్లపైకి, పంట బోదెల మీదకు వెళ్లి తుపాను సృష్టించిన బీభత్సాన్ని స్వయంగా పరిశీలించారు. రైతు కష్టం తెలిసిన నాయకుడిగా, అన్నదాతల కన్నీళ్లు తుడిచేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. భారీ వర్షాలకు నీట మునిగి కళ్లెదుటే పంట నాశనమవుతుంటే గుండెలు బాదుకుంటున్న కర్షకులకు అండగా నిలిచారు. ధ్వంసమైన రహదారుల్లో, బురదమయమైన పాలాల్లో నడుస్తూ, వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

మంచి దిగుబడితో పంట చేతికందే సమయంలో మురసు తుపాను దెబ్బతీసింది: రేటూరులో చంద్రబాబు





జపాన్ లో భారీ భూకంపం..

భయంతో పరుగులు పెట్టిన జనం

పెన్ పవర్ డెస్క్: జపాన్‌లో భారీ భూకంపం సంభవించి చింది. శుక్రవారం (నవంబర్ 6, 2026) రాత్రి తూర్పు తీరానికి సమీపంలోని సముద్ర ప్రాంతంలో రిక్టర్ స్కేల్‌పై 6.1 తీవ్రతతో భూమి కంపించింది. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 7:39 గంటల సమయంలో భూకంపం సంభవించినట్లు జపాన్ వాతావరణ

- మిగతా 2లో



యెమెన్‌లో మార్కెట్‌పై వైమానిక దాడి.. 20 మంది మృతి

పెన్ పవర్ డెస్క్: యెమెన్‌లోని ఓ రద్దీ మార్కెట్‌పై జరిగిన వైమానిక దాడిలో మంది మృతి చెందారు. అనేక మందికి గాయాలయ్యాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని హూతీ తిరుగుబాటు వర్గం పేర్కొంది. ఈ దాడికి సౌదీ అరేబియా కారణమని ఆరోపించింది. హైజ్ ప్రావిన్సులో

- మిగతా 2లో



ఒకటి కాదు రెండు కాదు.. 70కి పైగా అవమానాలు భరించా!

- కొత్త రాజకీయ పార్టీ స్థాపిస్తున్న విజయసాయిరెడ్డి
- ఈ నెల 11న పార్టీ ఆవిర్భావం
- పలువురు నేతలు పార్టీలో చేరిక
- రెండు కుటుంబాల పాలనకు ప్రత్యామ్నాయంగా వస్తున్నామన్న మాజీ ఎంపీ
- జగన్ పామ్మనకుండా పాగబెట్టి బయటకు పంపించారని తీవ్ర ఆరోపణ

పెన్ పవర్ డెస్క్: రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి వైసీపీ అధినేత జగన్ పై మరోసారి తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. తాను స్థాపిస్తున్న కొత్త పార్టీలో పలువురు నాయకులు చేరుతున్న సందర్భంగా విజయసాయిరెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ నుంచి తనను జగన్ అవమానించి బయటకు పంపించారని, పొమ్మనకుండా పొగబెట్టారని సంచలన ఆరోపణలు

కుర్చీలో ఆర్టీసీ డీఎం, నేలపై కార్మికులు..

మంత్రి పొన్నం సీరియస్!



- సిద్దిపేట ఆర్టీసీ డీఎం వ్యవహారశైలిపై మంత్రి పొన్నం ఆగ్రహం!
- కార్మికులను నేలపై కూర్చోబెట్టిన ఘటనపై విచారణకు ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీకి సూచన
- కార్మికుల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే సహించబోమని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్: సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం) వ్యవహారశైలిపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. కార్మికులతో సమావేశమైన సమయంలో డీఎం కుర్చీలో కూర్చోగా, కార్మికులు

- మిగతా 2లో

ముంబైలో మళ్ళీ బాంబు బెదిరింపులు..

అమితాబ్ బంగ్లా సహా పలు ప్రాంతాలు టార్గెట్!

- అమితాబ్ బచ్చన్ బంగ్లా, స్టాక్ ఎక్ఛేంజ్‌ను పేల్చేస్తామని హెచ్చరిక
- బాంబే హైకోర్టుకు నేరుగా వచ్చిన బెదిరింపు ఈ-మెయిల్
- అప్రమత్తమైన పోలీసులు, కీలక ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం

పెన్ పవర్ డెస్క్: ముంబై మహానగరంలో మరోసారి బాంబు బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ నివాసం 'జల్సా' సహా నగరంలోని పలు కీలక ప్రాంతాలను పేల్చివేస్తామంటూ ఆగంతుకులు

- మిగతా 2లో



చీరాల మున్సిపాలిటీలో అనూహ్య ఫలితాలు..

4 వార్డుల్లో గెలిచిన కాంగ్రెస్

- చీరాల మున్సిపల్ ఎన్నికల్లో ఖాతా తెరిచిన కాంగ్రెస్
- 1, 21, 25, 33వ వార్డులను కైవసం చేసుకున్న హస్తం పార్టీ
- మాజీ ఎమ్మెల్యే అమంచి కృష్ణమోహన్ ప్రభావమే కారణమంటున్న విశ్లేషకులు
- పురపాలికలో ఆధిక్యంలో కొనసాగుతున్న టీడీపీ
- గెలిచిన అభ్యర్థులకు ఏపీ కాంగ్రెస్ కమిటీ శు భాకాంక్షలు

- మిగతా 2లో



రాజ్యాంగం కంటే రాజకీయ పార్టీ గొప్ప కాదు

పెన్ పవర్ డెస్క్: రాజ్యాంగం పై భారత్ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగం కంటే ఏ ఒక్క రాజకీయ పార్టీ గొప్పది కాదని స్పష్టం చేశారు. సీజేఐని టార్గెట్ చేస్తూ

- మిగతా 2లో



రోకలితో కొట్టి.. భార్య సహా ఏడుగురిని చంపేసిన క్యాబ్‌డ్రైవర్

పెన్ పవర్ డెస్క్: కర్ణాటక రాజధాని బెంగళూరులో దారుణ ఘటన వెలుగుచూసింది ఓ క్యాబ్ డ్రైవర్.. తన భార్య, ఆమె బంధువులు సహా ఏడుగురిని దారుణంగా హత్య చేశాడు. ఒకరి తర్వాత ఒకరిని అతడు చంపిన తీరు తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. రాజాజీ

- మిగతా 2లో



ఆంధ్రప్రదేశ్‌లో జలకళ.. రిజర్వాయర్లలోకి కొత్త నీరు..

- భారీ వర్షాలతో ఏపీ జలాశయాల్లోకి చేరిన కొత్త నీరు
- మొత్తం 505.76 టీఎంసీలకు పెరిగిన నీటి నిల్వలు
- ప్రధాన జలాశయాల్లో మిశ్రమంగా నీటిమట్టాలు
- శ్రీశైలం, సోమశిల ప్రాజెక్టులలో ఇంకా తక్కువగానే నీరు
- రాష్ట్రవ్యాప్తంగా 10.3 మి.మీ సగటు వర్షపాతం నమోదు

- మిగతా 2లో



పెన్ పవర్

శనివారం 7 నవంబర్ 2026



ఒకటి కాదు రెండు కాదు.. 70కి పైగా అవమానాలు భరించా!

- మొదటి పేజీ తరువాయి

చేశారు.ఈ నెల 11వ తేదీన తన కొత్త పార్టీ ఆవిర్భావం ఉంటుందని స్పష్టం చేశారు. కొత్త పార్టీలో చేరికలను స్వాగతించారు. విశ్వ హిందూ పరిషత్‌లో దశాబ్దాలుగా పనిచేసిన సుమతి రెడ్డి, అనకాపల్లికి చెందిన హిందూ ఎస్సీ, ఎస్టీ కులాల పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బోని గణేశ్ తమ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. సుమతి రెడ్డి రాబోయే ఎన్నికల్లో తిరుపతి జిల్లా నుంచి శాసనసభకు పోటీ చేస్తారని, నియోజకవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ చేరికలు తమ పార్టీ సిద్ధాంతానికి నిదర్శనమని, అన్ని కులాలు, మతాలు, వర్గాలకు సమన్యాయం చేయడమే తమ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. "రాష్ట్రాన్ని రెండు కుటుంబాల చేతుల్లో పెట్టకూడదు. రాజ్యాంగబద్ధంగా ఎవరి హక్కులు వారికి దక్కాలి. యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అంతర్గత ప్రజాస్వామ్యంతో మా పార్టీ నడుస్తుంది" అని ఆయన వివరించారు.

జగన్ నన్ను బయటకు గెంటేశారు

వైసీపీ నుంచి బయటకు రావడానికి గల కారణాలను వివరిస్తూ ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "నేను పార్టీని వదిలి వెళ్ళలేదు, నన్ను బయటకు తోసేశారు. పొమ్మనకుండా పొగబెట్టి, అప్పుడప్పుడు అవమానించి, ఒక మనిషిగా భరించలేనటువంటి పరిస్థితులు కల్పించారు. అందుకే ఆ పార్టీని వీడాల్సి వచ్చింది. స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి గారు నన్నెప్పుడూ అవమానించలేదు. కానీ జగన్ పాలనలోనే ఇది జరిగింది. చెప్పుడు మాటలు విని నన్ను దూరం పెట్టారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకటి రెండు కాదు, 70కి పైగా అవమానాలను భరించానని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే పనులు చేస్తే ఎవరైనా ఎలా ఊరుకుంటారని ప్రశ్నించారు. "ప్రతి మనిషికీ ఆత్మగౌరవం ఉంటుంది. నా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినప్పుడు ఇక అక్కడ ఉండలేకపోయాను. కూర్చున్న కొమ్మను నరికేసినప్పుడు ఇంకేం చేయగలం? అందుకే బయటకు వచ్చాను" అని అన్నారు.

హిందూత్వ ముద్రపై స్పందన

పార్టీలో కాషాయ రంగు ప్రభావం ఎక్కువ అంటున్నారనే విమర్శపై విజయసాయిరెడ్డి స్పందిస్తూ, "మనం భారతమాత బిడ్డలం. మన అమ్మ గురించి మనం గొప్పగా చెప్పుకుంటాం. అలాగని ఇతరులను ద్వేషించం. భారతదేశంలోని ప్రతి క్రిస్టియన్, ముస్లిం వెనుక భారతీయ డీఎన్ఏ ఉంది. ఇది నిరూపితమైన సత్యం. మేము హిందూ ధర్మం గురించి మాట్లాడితే ఇతరులకు వ్యతిరేకం కాదు. అందరికీ సమన్యాయం చేయడమే మా పార్టీ ఉద్దేశం," అని స్పష్టం చేశారు.అధికారంలో ఉన్నామని విర్రవీగితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ ఏకపక్ష వైఖరి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని ఆయన విమర్శించారు. తాము పెట్టబోయే పార్టీలో ప్రతి ఒక్కరినీ గౌరవంగా చూసుకుంటామని, ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చే మూడో ప్రత్యామ్నాయంగా తమ పార్టీ నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రోకలితో కొట్టి.. భార్య సహా ఏడుగురిని చంపేసిన క్యాబ్‌డ్రైవర్

- మొదటి పేజీ తరువాయి

నగర్‌లో ఈ ఘటన జరిగింది. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు కేసు వివరాలు వెల్లడించారు.బెంగళూరు నగరంలో నివసిస్తోన్న నిందితుడు ఇందు శేఖర్.. క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి 20 ఏళ్ల క్రితం సునీతతో వివాహం జరిగింది. తమ వివాహ బంధంలో భార్య తరపు బంధువులు జోక్యం చేసుకుంటున్నారని శేఖర్ కొన్నేళ్లుగా అసంతృప్తితో ఉన్నాడు. ఆ వ్యవహారం వారి మధ్య గొడవలకు కారణమైంది. దాంతో భార్య సహా ఆమె బంధువులను రోకలితో కొట్టి చంపాడు. తర్వాత మృతదేహాలను నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో పడేశాడు. అక్టోబర్ 17 నుంచి ఒక్కొక్కరిని ఇంటికి రప్పించి ఈ హత్యలు చేయడం ప్రారంభించాడని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

మృతుల్లో భార్య సునీత, అత్త రూపవతి, బావమరుదులు శివకుమార్, శంకర్, అత్తింటికి చెందిన దివ్య, నళిని, ఏడేళ్ల చిన్నారి ఉన్నారు. ఒక్కొక్కరిని ఒక్కో కారణం చెప్పి.. ఇంటికి పిలిచి చంపేశాడని పోలీసులు వెల్లడించారు. భార్యను హత్య చేసిన తర్వాత.. ఆమె మృతదేహాన్ని మాయం చేశాడు (దీవఅస్త్రుశ్రీబతీబ వీబతీఎవతీ జ్ఞుంవ). ఆమె స్నేహితురాలితో కలిసి ట్రిప్‌నకు వెళ్లిందని ఇరుగురుపొరుగువారు, బంధువులతో నమ్మబలికాడు. ఆమె ఫోన్‌నూ స్విచ్ఛాఫ్ చేశాడు. మద్యం తాగుదామని బావమరుదులను ఇంటికి పిలిచాడు. నళిని కనిపించడం లేదని ఆమె తల్లి ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు విచారణలో భాగంగా శేఖర్‌ను ప్రశ్నించారు. తానే ఈ హత్యలు చేసినట్లు శేఖర్ (దీవఅస్త్రుశ్రీబతీబ జ్ఞుఎ ణతీఅజవతీ) అంగీకరించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ హత్యలు చేయడానికి నిందితుడికి అతడి కుమార్తె కూడా సహకరించిందని పోలీసులు అనుమానిస్తున్నారు.

ముంబైలో మళ్ళీ బాంబు బెదిరింపులు..

అమితాబ్ బంగ్లా సహా పలు ప్రాంతాలు టార్గెట్!

- మొదటి పేజీ తరువాయి

ఈ-మెయిల్ ద్వారా హెచ్చరించారు. ఈ మెయిల్ నేరుగా బాంబే హైకోర్టుకు రావడంతో భద్రతా ఏజెన్సీలు తక్షణమే అప్రమత్తమయ్యాయి.న్యూస్ ఏజెన్సీ ఐఏఎన్ఎస్ కథనం ప్రకారం... బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (దీూజు), వర్లీ రేస్‌కోర్స్, అమితాబ్ బచ్చన్ బంగ్లాను పేల్చివేస్తామని ఈ-మెయిల్‌లో పేర్కొన్నారు. "ఈ బెదిరింపును తీవ్రంగా పరిగణిస్తున్నాం. ముంబై పోలీసులు, ఇతర భద్రతా ఏజెన్సీలు దీనిపై దర్యాప్తు చేస్తున్నాయి. ఈ-మెయిల్ పంపిన వారిని గుర్తించే పనిలో ఉన్నాం" అని ముంబై పోలీసులు తెలిపినట్లు ఐఏఎన్ఎస్ వెల్లడించింది. బెదిరింపు నేపథ్యంలో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లు, స్థానిక పోలీసులు ఆయా ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఇటీవల కాలంలో ముంబైలో ఇలాంటి బెదిరింపులు ఎక్కువయ్యాయి. అక్టోబర్ 23న అమితాబ్ బచ్చన్ ఆస్తిని లక్ష్యంగా చేసుకుని ఓ స్కూల్‌కు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. అంతకుముందు బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (దీవీజ) ప్రధాన కార్యాలయానికి కూడా ఇలాంటి హెచ్చరికే అందింది. అయితే, తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు.తాజా ఘటనతో సైబర్ సెల్ పోలీసులు రంగంలోకి దిగారు. ఈ-మెయిల్ పంపిన వారి ఐపీ అడ్రస్, డిజిటల్ ఆధారాలను ట్రేస్ చేసి నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వరుస ఘటనల వెనుక ఒకే ముఠా ఉందా అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

జపాన్ లో భారీ భూకంపం..

- మొదటి పేజీ తరువాయి

సంస్థ వెల్లడించింది. రాజధాని టోక్యోతో పాటు పలు ప్రాంతాల్లో ప్రకంపనలు నమోదయ్యాయి. జపాన్ తూర్పు తీరానికి సమీపంలోని పసిఫిక్ సముద్ర ప్రాంతం భూకంప కేంద్రం కేంద్రీకృతమైందని జీహీూఅధికారులు వెల్లడించారు.భూమికి సుమారు 10 కిలోమీటర్ల లోతులో 6.1 ప్రకంపనల తీవ్రతతో భూకంపం సంభవించింది.

ఎక్కడెక్కడ ప్రకంపనలు వచ్చాయి..

జపాన్ వాతావరణ సంస్థ ప్రకారం మియాగి, ఫుకుషిమా, ఇబరాకి ప్రిఫెక్చర్లలోని కొన్ని ప్రాంతాల్లో ప్రకంపనలు నమోదయ్యాయి. రాజధాని టోక్యో మధ్య ప్రాంతంలోనూ భూమి కంపించినట్లు వార్తా సంస్థలు వెల్లడించాయి. ప్రకంపనలతో భయాందోళనకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చినట్లు ప్రాథమిక సమాచారం.

సునామీ ముప్పు ఉందా? నష్టం ఎంత?

ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న అధికారిక, అంతర్జాతీయ నివేదికల్లో సునామీ హెచ్చరికపై స్పష్టమైన సమాచారం లేదు. అలాగే ప్రాణనష్టం, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు కూడా తెలియాల్సి ఉంది.

బురదలో, పాలం గట్లపై సీఎం చంద్రబాబు.. క్షేత్రస్థాయిలో రైతులకు అండ..

తుపాను హెచ్చరికలు జారీ అయిన అక్టోబరు 27వ తేదీ నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు అప్రమత్తమయ్యారు. 'అర్నబ్', 'మురసు' తుపానుల సమయంలో రాత్రిళ్లు కూడా మేల్కొని కలెక్టర్లు, ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్సులు నిర్వహించారు. వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, ముంపునకు గురయ్యే ప్రాంతాలు, ప్రజల తరలింపు, సహాయక చర్యల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించారు. రాష్ట్ర యంత్రాంగాన్ని సమన్వయం చేయడమే కాకుండా, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి అవసరమైన సహాయం కోసం కృషి చేశారు. ఒకవైపు ఉన్నతాధికారులతో సమీక్షలు, మరోవైపు క్షేత్రస్థాయి పర్యటనలతో విపత్తు నిర్వహణలో తనదైన మార్క్ చూపించారు. ఆయన ముందుచూపు, సత్వర స్పందన వల్ల పెను నష్టాన్ని నివారించడంలో యంత్రాంగం సఫలమైంది.

క్షేత్రస్థాయిలో పర్యటనలతో వాస్తవాల పరిశీలన

అధికారులు ఇచ్చే నివేదికలతో సరిపెట్టకుండా, వాస్తవ నష్టాన్ని కళ్లారా చూసేందుకు చంద్రబాబు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇటీవలి 'అర్నబ్' తుపాను సమయంలో కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన నుంచి పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం వరకు దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించారు. తాజాగా 'మురసు' తుపాను కారణంగా అతలాకుతలమైన బాపట్ల జిల్లాలోని జిల్లెళ్లమూడి, గుంటూరు జిల్లాలోని రేటూరు గ్రామాల్లో పర్యటించారు. నీట మునిగిన వరి పొలాల్లోకి వెళ్లి, పంట బోదెల వద్ద నిలబడి నష్టాన్ని అంచనా వేశారు. బురదలో, పొలం గట్లపై తిరిగి పంటలు దెబ్బతిన్న వైనాన్ని కళ్లారా చూశారు.పర్యటనలో భాగంగా, రైతుల వద్దకే నేరుగా వెళ్లి వారి ఆవేదనను ఓపికగా విన్నారు. ఎన్ని ఎకరాల్లో పంట నష్టపోయారు, ఎంత పెట్టుబడి పెట్టారు, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం ఆశిస్తున్నారనే వివరాలను వారినే అడిగి తెలుసుకున్నారు. కష్టపడి పండించిన పంట కళ్ల ముందే నీటిపాలైన రైతుల బాధను చూసి చలించిన ఆయన, అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రకృతి విపత్తుల వల్ల రైతులు కుంగిపోకుండా, తిరిగి ధైర్యంగా వ్యవసాయం చేసుకునేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

మంచి దిగుబడితో పంట చేతికందే సమయంలో మురసు తుపాను దెబ్బతీసింది

మంచి దిగుబడితో పంట చేతికొచ్చి ఆనందంగా ఉన్న సమయంలో మురసు తుపాను రైతుల ఆశలను నీరుగార్చిందని సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటను తుపాను దెబ్బతీయడం అత్యంత బాధాకరమని, నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, గుంటూరు జిల్లా రేటూరు వద్ద రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలను వారికి వివరించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "అర్నబ్, మురసు తుపానుల వల్ల రాష్ట్రానికి, ముఖ్యంగా రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఎల్ నినో ప్రభావంతో రైతులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటుంటే, పట్టిసీమ ద్వారా నీరందించి పంటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించాం. మంచి దిగుబడితో పంట చేతికందే సమయంలో మురసు తుపాను రైతులను కోలుకోలేని దెబ్బతీసింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై తుపాను ప్రభావం తీవ్రంగా ఉందని తెలిపారు.ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలతో నష్టాన్ని చాలా వరకు నివారించగలిగామని సీఎం స్పష్టం చేశారు. "తుపానులపై ముందస్తు హెచ్చరికలు జారీ చేసినప్పుడు ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దు. ముందస్తు జాగ్రత్తల వల్లే ప్రాణనష్టాన్ని నివారించి, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగాం" అని విజ్ఞప్తి చేశారు. తుపాను సహాయక చర్యల కోసం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సాయం తీసుకుంటున్నామని వివరించారు. అర్నబ్ తుపాను వల్ల నేలకొరిగిన 30 వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించామని, మురసు తుపాను వల్ల దెబ్బతిన్న మరో 10 వేల స్తంభాలను కూడా యుద్ధప్రాతిపదికన సరిచేస్తున్నామని తెలిపారు. ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు.తుపానుల వల్ల జరిగిన నష్టంపై పూర్తిస్థాయిలో అంచనాలు వేస్తున్నామని, దీనిపై ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి సమాచారం అందిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఫోన్ చేసి తుపానుల ప్రభావంపై ఆరా తీశారని వెల్లడించారు. నష్టపోయిన రైతులకు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా పెట్టుబడిని తిరిగి అందిస్తామని హామీ ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చివరి వ్యక్తికి సాయం అందే వరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే పనిచేస్తారని స్పష్టం చేశారు. నల్లమడ డ్రెయిన్‌కు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామన్నారు.ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేశారు. "గత పాలనలో తుపానులు వస్తే రెడ్ కార్పెట్ వేయించుకుని పర్యటనలు చేసి పరామర్శించారు. కానీ మేము ఎన్నికల కంటే ప్రజా సమస్యలకే ప్రాధాన్యత ఇచ్చి క్షేత్రస్థాయిలో పనిచేశాం. కొందరు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడమే పనిగా పెట్టుకున్నారు. పరిషత్ ఎన్నికల ఫలితాలు వచ్చాక అన్ని విషయాలూ మాట్లాడతా" అని అన్నారు. తీర ప్రాంతాలను తుపానులు దెబ్బతీస్తుంటే, రాయలసీమను ఎల్ నినో ఇబ్బంది పెడుతోందని, అందుకే రాష్ట్రంలో నీటి భద్రత, సమర్థ నీటి నిర్వహణకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌లో జలకళ.. రిజర్వాయర్లలోకి కొత్త నీరు..

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని పలు జలాశయాల్లోకి కొత్తగా నీరు వచ్చి చేరింది. రాష్ట్ర జలవనరుల శాఖ గణాంకాల ప్రకారం, ప్రస్తుతం రిజర్వాయర్లలో మొత్తం 505.76 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇది జలాశయాల పూర్తి సామర్థ్యం 1,161.36 టీఎంసీలలో సుమారు 43.51 శాతానికి సమానం. వర్షాలు కొనసాగితే మరో 655.59 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉందని అధికారులు తెలిపారు.నదీ బేసిన్ల వారీగా చూస్తే, కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులలో అత్యధికంగా 318.27 టీఎంసీలు (42.47% సామర్థ్యం), పెన్నా బేసిన్‌లో 107.74 టీఎంసీలు (36.47%), గోదావరి బేసిన్‌లో 20.51 టీఎంసీలు (76.72%) నిల్వ ఉన్నాయి. ఇతర బేసిన్లలోని ప్రాజెక్టులలో కలిపి 58.72 టీఎంసీల నీరు ఉంది.అయితే, ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు మిశ్రమంగా ఉన్నాయి. శుక్రవారం నాటి లెక్కల ప్రకారం, శ్రీశైలం డ్యామ్‌లో 215.81 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను కేవలం 51.60 టీఎంసీల (23.9%) నీరు మాత్రమే ఉంది. ఇక్కడ నీటిమట్టం 885 అడుగులకు గాను 832 అడుగుల వద్ద ఉంది. నాగార్జున సాగర్‌లో 180.91 టీఎంసీలు (58%), పులిచింతలలో 28.19 టీఎంసీల (61.6%) నీరు నిల్వ ఉంది.మరోవైపు, పెన్నా బేసిన్‌లోని సోమశిల ప్రాజెక్టులో 19.74 టీఎంసీలు (25.3%), కండలేరులో 16.70 టీఎంసీలు (24.6%) ఉన్నాయి. అదే సమయంలో, గండికోట (69.5%), గోరకల్లు (78.8%), ఏలేరు (91%) వంటి రిజర్వాయర్లలో నీటిమట్టాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా, నవంబరు 4 ఉదయం 8.30 గంటల నుంచి నవంబర్ 5 ఉదయం 8:30 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా సగటున 10.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మొత్తం మీద రాష్ట్రంలో నీటి నిల్వలు పెరిగినప్పటికీ, శ్రీశైలం వంటి కీలక ప్రాజెక్టులు నిండాలంటే భారీ వర్షాలు అవసరమని స్పష్టమవుతోంది.

కుర్చీలో ఆర్టీసీ డీఎం, నేలపై కార్మికులు..

మంత్రి పొన్నం సీరియస్!

- మొదటి పేజీ తరువాయి

నేలపై కూర్చున్నట్లుగా ప్రచారంలోకి వచ్చిన ఘటనపై ఆయన పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "సిద్దిపేట డిపోలో జరిగిన ఘటన నా దృష్టికి వచ్చింది. ఈ అంశంపై తక్షణమే ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించాను. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి" అని తెలిపారు.ప్రజా పాలన ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమానికి, వారి ఆత్మగౌరవానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. "ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకం. సంస్థ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులను గౌరవంగా చూడాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉంది. వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా సహించే ప్రసక్తే లేదు" అని మంత్రి స్పష్టం చేశారు.

కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా, అగౌరవంగా ప్రవర్తించే అధికారులపై భవిష్యత్తులో కఠిన చర్యలు తప్పవని పొన్నం ప్రభాకర్ గట్టిగా హెచ్చరించారు. అధికారులు తమ పరిధిలో కార్మికులతో గౌరవప్రదంగా, బాధ్యతాయుతంగా మెలగాలని ఆయన హితవు పలికారు.

రాజ్యాంగం కంటే రాజకీయ

పార్టీ గొప్ప కాదు

- మొదటి పేజీ తరువాయి

పోస్ట్ చేసిన వ్యవహారంలో స్పందించిన విచారణ చేపట్టిన జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం పంచోలి బెంచ్.. కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్షుడు సహా పలువురు నేతలకు నవంబర్ 6న నోటీసులు జారీ చేశారు.న్యాయవాది వినీత్ జిందాల్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు..కేపీసీసీ అధ్యక్షుడు, కార్యదర్శితో సహా కమిటీ అధికారులందరూ తమపై కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోవద్దో వివరించాలని ఆదేశించింది.ఈ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగమే సర్వోన్నతమైనదని, ఏ వ్యక్తీ, ఏ రాజకీయ పార్టీ దానికంటే పైన నిలవలేరని చేసింది. న్యాయపాలన స్వాతంత్ర్యం రాజకీయ అనుకూలత బట్టి మారే విషయం కాదని కోర్టు స్పష్టం చేసింది.న్యాయ నిర్ణయాలపై విమర్శ చేయవచ్చునని , అయితే న్యాయవ్యవస్థను భయపెట్టేందుకు లేదా న్యాయపాలనకు అడ్డుపడేందుకు భావప్రకటనా స్వేచ్ఛను ఆసరాగా వాడుకోలేరని కోర్టు తెలిపింది.

కేపీసీసీ తరపు న్యాయవాది వాదిస్తూ, ఆ పోస్ట్ ను పార్టీ నేతల అనుమతి లేకుండా ఓ కార్యకర్త చేశారని, విషయం తెలిసిన వెంటనే తొలగించారని చెప్పారు. పార్టీ అప్పటికే షరతులు లేని క్షమాపణ చెప్పిందని, కోర్టుకు కూడా క్షమాపణ దాఖలు చేస్తామని చెప్పారు. దానిపై స్పందించిన జస్టిస్ అరవింద్ కుమార్, క్షమాపణ నిజంగా హృదయపూర్వకంగా వచ్చిందా లేదా కేవలం కాగితానికే పరిమితమైందా అని పరిశీలిస్తామని అన్నారు.కోర్టు ఈ దశలో నేతలను నేరుగా హాజరు కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అటార్నీ జనరల్‌ను, సీనియర్ న్యాయవాదులు అరవింద్ దాతర్, సిద్ధార్థ్ అగర్వాల్‌లను అమికస్ క్యూరీగా నియమించే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు బెంచ్ తెలిపింది.

యెమెన్‌లో మార్కెట్‌పై వైమానిక దాడి.. 20 మంది మృతి

- మొదటి పేజీ తరువాయి

ఈ ఘటన జరిగిందని, అనేక మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా ధ్రువీకరించింది.

హల్ అదారా మార్కెట్‌పై మూడు వైమానిక దాడులు జరిగాయని, అనేక మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారని హూతీ సైనిక అధికార ప్రతినిధులు వెల్లడించారు. కామిస్ ముషాయిత్ వైమానిక స్థావరం నుంచి యుద్ధ విమానాలు టేకాఫ్ అయ్యాయని, తైజ్ ప్రావిన్సు మీదుగా వెళ్లాయని అన్నారు. మరోవైపు, తైజ్ ప్రావిన్సు అధికారులు మాత్రం వీటిని తోసిపుచ్చారు. ఇది హూతీల చర్యేనని.. ఇక్కడ ఎలాంటి వైమానిక దాడులు జరగలేదని పేర్కొన్నారు. హూతీ తిరుగుబాటుదారులే క్షిపణులతో విచక్షణారహితంగా దాడులు జరుపుతున్నారని స్థానిక ప్రభుత్వ మీడియా కార్యాలయం పేర్కొంది.

విక్రమ్ రెడ్డి వంద మందితో వచ్చి బూత్ క్యాప్చరింగ్‌కు యత్నించారు

స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తుంటే, వైసీపీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు.నెల్లూరులో ఆయన మాట్లాడుతూ... ఓసీకి కేటాయించిన మేయర్ స్థానాన్ని బీసీలకు కేటాయించడమే టీడీపీ నిబద్ధతకు నిదర్శనమని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో నామినేషన్ల సమయంలోనే అభ్యర్థులను బెదిరింపులకు గురి చేశారని... ఇప్పుడు సక్రమంగా ఎన్నికలు జరుగుతుంటే ఆటంకాలు కలిగిస్తున్నారని విమర్శించారు. ఆత్మకూరులో 10 వార్డులు వైసీపీ గెలుచుకున్నా తాము అభ్యంతరం చెప్పలేదని గుర్తుచేశారు. అనంతసాగరం పోలింగ్ కేంద్రంలో జరిగిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. మాజీ ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి వందమంది అనుచరులతో వచ్చి బూత్ క్యాప్చరింగ్‌కు ప్రయత్నించారని, దొంగ ఓట్లు వేయించారని సంచలన ఆరోపణలు చేశారు. దొంగ ఓట్లు వేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు.ఈ సందర్భంగా విక్రమ్ రెడ్డిని ఉద్దేశించి ఆనం ఘాటు వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ అనుభవాన్ని తక్కువ అంచనా వేయొద్దని, సుప్రీంకోర్టుకు లాగుతాననే బెదిరింపులకు తాను భయపడనని స్పష్టం చేశారు. ప్రస్తుతం సంయమనంతో వ్యవహరిస్తున్నానని, తన సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని ఆయన గట్టిగా హెచ్చరించారు.

పరిషత్ పోరులో గెలుపెవరిది?

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం..

- మొదటి పేజీ తరువాయి

ఈ కౌంటింగ్ కేంద్రాల దగ్గర ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో ప్రారంభమయ్యే కౌంటింగ్.. తొలి ఫలితం వచ్చేసరికి కనీసం నాలుగు గంటలు సమయం పడుతుందని అంచనా. రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఈనెల 5న జరిగిన పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఓటర్లు తమ తీర్పును పొందుపరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా 70.72 శాతం ఓటింగ్ నమోదు కావడం ఓటర్లలో చైతన్యానికి నిదర్శనంగా ఉంది. వరదలు, తీవ్ర వర్షాల వల్ల పోలింగ్ వాయిదా పడ్డ 5 మండలాల్లో ఇవాళ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఇవి కాక మరో మూడు జిల్లాల్లో వివిధ కారణాల వల్ల మళ్లీ పోలింగ్ నిర్వహించాలని ఎస్ఈసీ నిర్ణయించింది. వాటికి కూడా పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. 28 జిల్లాల్లో మొత్తం 365 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 11 వేలకు పైగా కౌంటింగ్ సూపర్‌వైజర్లు విధులను నిర్వహించనున్నారు. వీరితోపాటు 28,500 మంది కౌంటింగ్ సిబ్బంది, సహాయకులు ఉంటారు.

చీరాల మున్సిపాలిటీలో అనూహ్య ఫలితాలు..

4 వార్డుల్లో గెలిచిన కాంగ్రెస్

ఆంధ్రప్రదేశ్ పురపాలక ఎన్నికల ఫలితాల్లో బాపట్ల జిల్లా చీరాల మున్సిపాలిటీ ఫలితాలు ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అధికార టీడీపీ కూటమి హవా కొనసాగినప్పటికీ, చీరాలలో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా పుంజుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్ ఏకంగా నాలుగు వార్డులను కైవసం చేసుకుని దశాబ్ద కాలం తర్వాత తన ఉనికిని చాటుకుంది. వాస్తవానికి మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 3న జరిగింది. అయితే మురసు తుపాను ప్రభావంతో చీరాలలో కౌంటింగ్ నవ

పెన్ పవర్
సెంట్రల్ అంధ్ర
ఏన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

రోడ్ కారిడార్, జంక్షన్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి కమిషనర్ కె.మయూర్ అశోక్

గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 6,

శక్రవారంనగరపాలకసంస్థప్రధానకార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో నగరంలో అభివృద్ధి పనులపై ఎస్ఈ, ఈఈ, ఏడీహెచ్, డిఈఈలతో సమీక్షా సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగర అభివృద్ధికి గీటురాయిగా నిలిచే రోడ్ కారిడార్, జంక్షన్ల అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలన్నారు. ప్రతి పనికి నిర్దేశిత టైమ్ లైన్ పెట్టుకోవాలన్నారు. అలాగే పబ్లిక్ టాయ్ లెట్స్ నిర్మాణంకు గుర్తించిన 12 ప్రాంతాల్లో పనులు ప్రారంభించాలని, ఎక్కడైనా స్థల సమస్య ఎదురైతే డిప్యూటీ సిటి ప్లానర్ తో



సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు. నగరంలో పచ్చదనం పెంపుకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అందులో భాగంగా పార్క్ ల అభివృద్ధితోపాటు డివైడర్లలో ఎవెన్యూ ప్లాంటేషన్ త్వరితగతిన చేపట్టాలన్నారు. డివైడర్లలోని మొక్కలను అందంగా ట్రిమ్మింగ్ చేయాలని, మొక్కలకు జిఎంసి ఆధ్వర్యంలో తయారు చేస్తున్న వర్మి కంపోస్ట్ ని వినియోగించాలని ఏడీహెచ్ ని ఆదేశించారు. నూతనంగా ఏర్పాటు చేసే ప్లాంటేషన్ కి 2 ఏళ్లు సదరు కాంట్రాక్టరే నిర్వహణ చేయాలని డిఈఈకి స్పష్టం చేశారు.
సమావేశంలో ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు, ఈఈ వేణు గోపాల్, డిఈఈ శ్రీనివాస్, ఏడీహెచ్ శాంతి పాల్గొన్నారు.

బాణాసంచా వ్యాపారం నిర్వహించు వ్యాపారస్తులు సింగల్ విండో కౌంటర్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి కమిషనర్ కే. మయూర్ అశోక్

గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 6,

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, దీపావళి పండుగను ప్రజలందరూ సురక్షితమైన వాతావరణంలో జరుపుకునేలా నగరంలో ప్రమాద రహితంగా బాణాసంచా షాపులను ఏర్పాటు చేసుకోవడానికి గుంటూరు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగం నందు ఏర్పాటు చేసిన సింగిల్ విండో కౌంటర్ లో వ్యాపారస్తులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతించిన నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే తాత్కాలిక బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేయాలన్నారు. బాణాసంచా షాపును ఏర్పాటు చేయుటకు దరఖాస్తు దారుని ఫోటోతో అప్లికేషన్, అగ్నిమాపక శాఖ నుండి ఎన్ఓసి, ట్రాఫిక్ పోలీస్ అనుమతి, ఫీల్డ్ వెరిఫికేషన్ టీం అనుమతి పత్రం, జిఎస్టీ చెల్లించిన రశీదు, స్థల యజమాని అంగీకార పత్రం, ప్రాపర్టీ టాక్స్ రిసిప్ట్, డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్, రెవెన్యూ అనుమతి పత్రాలను జత చేస్తూ, జిఎంసిలోని సింగిల్ విండో కౌంటర్ లో దరఖాస్తు



చేయాలని, వాటిని పరిశీలించి, వెంటనే అనుమతి మంజూరు చేస్తామని తెలిపారు. షాపులు ఏర్పాటు చేయుటకు వ్యాపారస్తుల నుండి ఇప్పటికి వరకు 35 దరఖాస్తులు అందాయని, సదరు దరఖాస్తులను ఫీల్డ్ వెరిఫికేషన్ టీం తనిఖీ చేసిన అనంతరం అనుమతులు మంజూరు చేయుట జరుగుతుందన్నారు. ముఖ్యంగా నిబంధనలకు విరుద్ధంగా నివాస ప్రాంతాలలో గానీ, ముందస్తు అనుమతి లేకుండా గానీ అనధికారికంగా షాపులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి దుకాణం వద్ద అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా తగినంత నీరు, ఇసుక బకెట్లు మరియు అగ్నిమాపక పరికరాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని తెలియచేశారు. బాణాసంచా విక్రయ కేంద్రాల వద్ద కొనుగోలుదారుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాటుపై ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకోవాలన్నారు. వ్యాపారస్తులందరూ అధికారుల సూచనలను పాటిస్తూ, సురక్షితమైన పద్ధతుల్లో వ్యాపారాలు నిర్వహించి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడానికి సహకరించాలన్నారు.

పల్నాడు జిల్లాలో దెబ్బతిన్న పంటల పరిశీలన.. రైతులకు శాస్త్రవేత్తల సలహాలు

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 06 :

మురసు తుఫాను కారణంగా పల్నాడు జిల్లాలో దెబ్బతిన్న మిరప, ఉద్యాన పంటలను లామ్ ప్రాంతీయ ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.నాగేంద్ర రెడ్డి, డాక్టర్ పి.గంగాధర్ రావు పరిశీలించారు. ఎడ్లపాడు, నాదెండ్ల, చిలకలూరిపేట మండలాల్లోని పలు గ్రామాలలో పర్యటించి పంట పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా పొలంలో నిల్చిన నీటిని వెంటనే బయటకు పంపాలని, వాలిపోయిన మొక్కలను నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలని సూచించారు. వడలిన, పాలిపోయిన మొక్కలకు యూరియా,మెగ్నీషియం సల్ఫేట్, 19:19:19 మరియు ఆన్నభేది ద్రావణాలను పిచికారీ చేయాలని తెలిపారు. బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్, స్టెప్టోసైక్లిన్ మందులను పిచికారీ చేయాలని, ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్, 200 కిలోల వేప పిండిని వేయాలని వివరించారు.
తుఫానుతో దెబ్బతిన్న కూరగాయల పందిళ్లు, అరటి, నిమ్మ



తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడామని జిల్లా ఉద్యాన అధికారి ఐ.వెంకట రావు తెలిపారు. నష్టపోయిన రైతులు తిరిగి ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వ పథకాల ద్వారా రాయితీలు వర్తింపజేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట ఉద్యాన అధికారి ఆర్.శ్రీలక్ష్మి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కార్పొరేటర్లు అంకితభావంతో పనిచేయాలి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి..



గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 6,

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి ఐక్యతే ప్రజా సంక్షేమానికి బలమైన పునాది అని, చిన్నపాటి అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ కుటుంబంలో సమస్యలను పరిష్కరించుకున్నట్లే మన ముగ్గురం సమస్వయంతో సాగాలని, నాలుగో వ్యక్తికి అధికారాన్ని అప్పగించే అవకాశం ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్ళా మాధవి స్పష్టం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధ్యక్షతన నియోజకవర్గ ఎన్డీయే కూటమి కార్పొరేటర్లు, అభ్యర్థుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ విచ్చేశారు. కార్పొరేషన్ చైర్మన్లు డేగల ప్రభాకర్, మల్లె ఈశ్వర్ రావు, బుచ్చి రామ్ ప్రసాద్, మద్దిరాల మ్యానీ, తాళ్ళ వెంకటేష్ యాదవ్, కనపర్తి శ్రీనివాసరావు, గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ కుర్రా అప్పారావు, కోవెలమూడి రవీంద్ర, జనసేన పార్లమెంటరీ సమన్వయకర్త కిలారి రోశయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు, నారాయణ రెడ్డి, అబ్బూరి నాగ మల్లేశ్వరరావు,మానుకొండ శివ ప్రసాద్ తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ..గత 2024 ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు, కూటమి శ్రేణులు తనకు 50 వేల భారీ మెజారిటీని అందించి గెలిపించారని, అదే బాధ్యతతో, పార్టీ నాయకులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణని కూడా నియోజకవర్గం నుంచి 50 వేలకు పైగా మెజారిటీతో నిలబెట్టామని, నమ్మిన నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలబడటమే మన రాజకీయ విధానం కావాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. డివిజన్ స్థాయిలో ప్రతి అభ్యర్థి విజయం వెనుక నిస్వార్థంగా శ్రమించిన ప్రతి ఒక్క నాయకుడిని, కార్యకర్తను, కుటుంబాన్ని ఏమాత్రం విస్మరించకూడదని, అందరినీ కలుపుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు విజనరీ నాయకత్వంలో ముందుకు సాగుతున్నామని చెబుతూ, కార్పొరేటర్లందరూ తమ డివిజన్లలో ప్రత్యేక ముద్ర వేసి ఆదర్శ నాయకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజల అవసరాలు, డివిజన్ల అభివృద్ధి ప్రణాళికలను మేయర్ దృష్టికి తీసుకెళ్లి, కౌన్సిల్ ఆమోదంతో పాటు అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో అభివృద్ధిని ప్రత్యక్షంగా చూపించాలని స్పష్టం చేశారు. అలాగే మహిళా శక్తికి నిదర్శనంగా నిలిచే ఈ నియోజకవర్గంలో మహిళా ప్రజాప్రతినిధులు ఆదర్శవంతంగా పనిచేస్తూ నగరవ్యాప్తంగా ప్రగతి పథంలో మార్పును చాటాలని, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణలా ప్రజాసేవను బాధ్యతగా భావిస్తూ ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్పొరేటర్లు, అభ్యర్థులతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆత్మీయ సమావేశం.. పాల్గొన్న మేయర్ కోవెలముడి లక్ష్మీ అపర్ణ



గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 6,

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవిఅధ్యక్షతనశుక్రవారంనియోజకవర్గ కార్పొరేటర్లు, అభ్యర్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి , నగర మేయర్ కోవెలముడి లక్ష్మీ అపర్ణ తో కలిసి 30వ డివిజన్ కార్పొరేటర్ ఆళ్ళ శిరీష, జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతం, ప్రజలకు మరింత చేరువగా ఉంటూ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడం వంటి అంశాలపై ఆత్మీయంగా చర్చించారు.ప్రజల ఆశయాలకు అనుగుణంగా సమన్వయంతో పనిచేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకుల మధ్య పరస్పర సహకారం, ఐక్యతతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ సమావేశం సాగింది.
ఈ ఆత్మీయ సమావేశం నాయకులు, ప్రజా ప్రతినిధుల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

గుంటూరు జిల్లా రేటూరు వద్ద రైతులతో మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు





గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 6,

గుంటూరు జిల్లా రేటూరు వద్ద రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడారు. అర్నబ్, మురసు తుఫాన్ల కారణంగా రాష్ట్రంలో రైతులకు జరిగిన నష్టాన్ని వివరిస్తూ, ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలను వెల్లడించారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. అర్నబ్, మురసు తుఫాన్ల వల్ల రాష్ట్రానికి భారీ నష్టం వాటిల్లిందని, పంట చేతికొచ్చే సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో పట్టిసీమ ద్వారా నీటిని అందించి పంటలు సాగు చేయించామని, మంచి దిగుబడి వచ్చే సమయంలో మురసు తుఫాన్ రైతులను దెబ్బతీసిందని పేర్కొన్నారు.ప్రభుత్వం ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల చాలా వరకు నష్టాన్ని నివారించగలిగామని తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై మురసు తుఫాన్ తీవ్ర ప్రభావం చూపిందని వెల్లడించారు. ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలని సూచిస్తూ, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రైతులకు నష్టపోయిన పెట్టుబడిని తిరిగి పొందే అవకాశం ఉంటుందని వివరించారు.తుఫాన్లపై ముందస్తు హెచ్చరికలను ప్రజలు నిర్లక్ష్యం చేయకూడదని విజ్ఞప్తి చేశారు. సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సహాయం తీసుకుంటున్నామని తెలిపారు. అర్నబ్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న 30 వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించామని, మురసు తుఫాన్ వల్ల మరో 10 వేల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఆక్వా చెరువులకువిద్యుత్‌సరఫరానుత్వరితగతిన పునరుద్ధరిస్తున్నామని చెప్పారు.తుఫాన్ల వల్ల జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేస్తున్నామని, కేంద్ర ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా తుఫాన్ ప్రభావంపై వివరాలు అడిగి తెలుసుకున్నారని వెల్లడించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చివరి బాధితుడికి సాయం అందే వరకు ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు.నల్లమడ డ్రైన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. గత పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని విమర్శిస్తూ, గతంలో తుఫాన్ల సమయంలో పర్యటనలు, పరామర్శలకే పరిమితమయ్యారని వ్యాఖ్యానించారు. ఎన్నికల కంటే ప్రజా సమస్యలకే ప్రాధాన్యత ఇచ్చి తుఫాన్ సహాయక చర్యలు చేపట్టామని అన్నారు.
తీర ప్రాంతాలను తుఫాన్లు ఇబ్బంది పెడుతుంటే, రాయలసీమ ప్రాంతాన్ని ఎల్ నినో ప్రభావం తీవ్రంగా దెబ్బతీసిందని పేర్కొన్నారు. రాయలసీమలో కరువు పరిస్థితులను అధ్యయనం చేసేందుకు కేంద్ర బృందాలు కూడా పర్యటించాయని తెలిపారు.తీర ప్రాంతాల్లో నీరు వృథాగా సముద్రంలోకి వెళుంటే, రాయలసీమలో నీటి కొరత ఏర్పడుతోందని అన్నారు. రాష్ట్రంలో నీటి భద్రత, సమర్థవంతమైన నీటి నిర్వహణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

ఈ-వ్యర్థం వ్యర్థం మాత్రమే కాదు.. సక్రమ రీసైక్లింగ్‌తో విలువైన వనరు

విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 6,

విజయవాడలోని మారిస్ స్టెల్లా కళాశాలలో ఈ-వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి విజయవాడ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.
ఈ కార్యక్రమంలో ఏపీపీసీబీ చైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య పాల్గొని విద్యార్థులకు ఈ-వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇతర వ్యర్థాల నుంచి వేరు చేసి, అధీకృత రీసైక్లర్లకు మాత్రమే అందించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.
ప్రపంచవ్యాప్తంగా ఈ-వ్యర్థాల ఉత్పత్తి రోజురోజుకూ పెరుగుతోందని పర్యావరణ ఇంజనీర్ పి. శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సమస్యను నివారించేందుకు సమర్థవంతమైన సేకరణ, వర్గీకరణ, శాస్త్రీయ నిర్వహణ విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.
ఈ-వ్యర్థాలను సక్రమంగా రీసైకిల్ చేస్తే విలువైన వనరులను తిరిగి పొందవచ్చని జూనియర్ రీసెర్చ్ ఫెలో ఎం.డి. ఫాతిమా షహనాజ్ వివరించారు. ఈ-వ్యర్థాల్లో 50 శాతానికి పైగా లోహాలు, విలువైన మూలకాలు ఉంటాయని తెలిపారు.
ఈ-వ్యర్థాల నిర్వహణ రంగంలో ఉపాధి అవకాశాలు, నూతన వ్యాపార ఆలోచనలు, స్టార్టప్‌లకు ఉన్న అవకాశాలను అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ చంద్రశేఖర్ విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా ఏపీపీసీబీ, మారిస్ స్టెల్లా కళాశాల సంయుక్తంగా ఈ-వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ-వ్యర్థాలను అందజేశారు. సేకరించిన వ్యర్థాలను అధీకృత రీసైక్లర్లకు అప్పగించనున్నారు.అలాగే క్విజ్, చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు పర్యావరణహిత బాటిళ్లు, సంచులను బహుమతులుగా అందజేశారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ఇనాసమ్మ గాడే, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ఎస్. ఆశా, విభాగాధిపతి డాక్టర్ ఎస్. వాణి లత, వృక్షశాస్త్ర విభాగాధిపతి టి. కిరణ్మణి తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఈ-వ్యర్థాల సక్రమ నిర్వహణ, వనరుల పునరుద్ధరణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించారు.



సీఎం చంద్రబాబు సారథ్యంలో పని చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి ఎమ్మెల్యే నసీర్





గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 6,

నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉండాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ను కలిసేందుకు వచ్చిన నియోజకవర్గ కార్పొరేటర్లు ఎమ్మెల్యే నసీర్ దిశా నిర్దేశం చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేయాలని సూచించారు. ఇప్పటి నుంచే డివిజన్లో సమస్యలను గుర్తించాలని చెప్పారు ప్రతి సమస్య పరిష్కారానికి పక్క ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సమస్యలు ఏ అధికారి వద్దకు తీసుకెళ్తే పరిష్కారం అవుతాయో తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు నగరాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గంలో 400 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్పొరేటర్లు ముందంజలో ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎదురయ్యే ప్రతి సమస్యనూ ప్రభుత్వాధికారులు దృష్టికిగానీ, మా దృష్టికిగానీ వెంటనే తీసుకురావాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందేలా చూడాల్సిన బాధ్యత కార్పొరేటర్లదేనని స్పష్టం చేశారు . నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే నసీర్ సారథ్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఓట్ల లెక్కింపునకు విస్తృత ఏర్పాట్లుకలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 6,

ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్టీఆర్ జిల్లాలో విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. 16 జెడ్‌పీటీసీ, 276 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా తొమ్మిది ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేసి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ.. జెడ్‌పీ సీఈవో పి.సుశీల, విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను, రిటర్నింగ్ అధికారి కేవీఎస్ఆర్ రవికుమార్‌తో కలిసి విజయవాడ సబ్‌కలెక్టర్‌కార్యాలయంవద్దగలమాంటిస్సోరి కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విజయవాడ రూరల్ కౌంటింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఓట్ల లెక్కింపునకు చేసిన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. 18 కౌంటింగ్ హాళ్లు, 281 కౌంటింగ్ టేబుళ్లతో పాటు ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సుమారు 1,500 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, ఇతర సహాయ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. వీరికి ఎన్నికల నిబంధనలు, ఓట్ల లెక్కింపు విధానం, అనుసరించాల్సిన మార్గదర్శకాలపై తగిన శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు నిర్వహించే కేంద్రాల్లో కౌంటింగ్ హాళ్లు, టేబుళ్లు, బారికేడ్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, సీసీ కెమెరాలు, తాగునీరు, విద్యుత్, వెలుతురు, ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లను పూర్తిచేసినట్లు





వెల్లడించారు. రిటర్నింగ్ అధికారులు రౌండ్ల వారీగా వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ధ్రువీకరించిన తర్వాత ఎన్నికల ఫలితాలను అధికారికంగా ప్రకటిస్తారని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలు, బయట ప్రదేశాల్లో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండాపటిష్టపోలీసుభద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి ఉన్న వ్యక్తులనుమాత్రమేగుర్తింపుకార్డులతోఅనుమతించడం, రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం, కౌంటింగ్ ప్రక్రియను నిరంతరంపర్యవేక్షించడంవంటిచర్యలుచేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఓట్ల లెక్కింపును ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తిచేసేలా దిశానిర్దేశం చేసినట్లు వెల్లడించారు.

తొమ్మిది చోట్ల కౌంటింగ్‌కు ఏర్పాట్లు:

ఎ.కొండూరు,విస్సన్నపేట, తిరువూరు, గంపలగూడెం మండలాల సెగ్మెంట్లకు సంబంధించి కౌంటింగ్ తిరువూరులోని శ్రీ వాహిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కేంద్రంలో జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. విజయవాడ రూరల్ మండలానికి సంబంధించి విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయం, ఓల్డ్ మాంటిస్సోరి కళాశాలలో జరుగుతుందన్నారు.జి.కొండూరుకుకుంటముక్కలలోని లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా మైలవరం, రెడ్డిగూడెం మండలాలకు మైలవరంలోని లక్కిరెడ్డి హనిమిరెడ్డి ఇండోర్ స్టేడియంలో, ఇబ్రహీంపట్నంకుకొండపల్లిజెడ్‌పీబాలికలహైస్కూల్‌లో, జగ్గయ్యపేట,పెనుగంచిప్రోలు,వత్సవాయిమండలాలక ు జగ్గయ్యపేటలోని ఎస్‌జీఎస్ కళాశాల కేంద్రంలో జరుగుతుందన్నారు. నందిగామ మండలానికి నందిగామ జెడ్‌పీ ఉన్నతపాఠశాలలో, చందర్లపాడుకు నందిగామ కేవీఆర్ డిగ్రీ కళాశాలలో కంచికచర్ల, వీరుళ్లపాడుమండలాలకుకంచికచర్లమార్కెట్‌యార్డులో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రంలో కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

నాదెండ్లలో దీపావళి టపాసుల అమ్మకాలకు అనుమతులు తప్పనిసరి:తహశీల్దార్ చంద్రశేఖర్

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 06 :

దీపావళి పండుగను పురస్కరించుకుని మందుగుండు సామాగ్రి (టపాసులు) విక్రయించే దుకాణాల ఏర్పాటుకు సంబంధిత అధికారులు స్పష్టమైనమార్గదర్శకాలు జారీ చేశారు. నాదెండ్ల మండలంలో టపాసుల విక్రయాలు జరిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు పొందాలని తహశీల్దార్ ఎస్. చంద్రశేఖర్ శుక్రవారం స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలనుకునే వ్యాపారులు నిబంధనల ప్రకారం అన్ని సరైన పత్రాలను సమర్పించిముందస్తుఅనుమతులుపొందాలనిసూచించారు.నిబంధనలను ఉల్లంఘించి, ఎలాంటి అనుమతులు లేకుండా అనధికారికంగా దీపావళి టపాసుల అమ్మకాలు చేపడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన గట్టిగా హెచ్చరించారు.వ్యాపారులు ఎలాంటి ఆకస్మిక చర్యలకు గురికాకుండా, పండుగ సీజన్‌కు ముందే తగిన అనుమతులు తీసుకోవాలని తహశీల్దార్ కోరారు.



పుట్టినరోజును వేడుకలా కాకుండా సామాజిక బాధ్యతగా మార్చడం అభినందనీయం: ఎమ్మెల్యే గళ్ళా మాధవి





గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 6,

తలసేమియా రహిత భారతావని కోసం 79 ఏళ్ల వయసులోనూ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని, పుట్టినరోజును వేడుకలా కాకుండా సామాజిక బాధ్యతగా మార్చడం అభినందనీయమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు లక్ష్మీపురం 3వ లైన్‌లోని శ్రీ చైతన్య ఐకాన్ క్యాంపస్‌లో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్-పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి 79వ జన్మదినాన్ని పురస్కరించుకుని భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై, రక్తదానం చేస్తున్న అధ్యాపకులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... సాధారణంగాపుట్టినరోజు అంటే కేక్ కట్ చేసుకోవడం, పాత విజయాలు మాట్లాడుకోవడం మాత్రమే కాకుండా, దానిని ఒక సామాజిక బాధ్యతగా మార్చి సేవా కార్యక్రమాలు నిర్వహించడం డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి గొప్పదనానికి నిదర్శనమన్నారు. తమ సంస్థల్లో చదువుకునే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా, సమాజానికి అవసరమైన ఇలాంటి సేవా కార్యక్రమాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థలు ముందుండడంఎంతోఅభినందనీయమనికొనియాడారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రుల ఆవేదన వర్ణనాతీతమని, ఆ సమస్య తీవ్రతను గుర్తించే రాష్ట్ర ప్రభుత్వం కూడా వారికి ప్రత్యేకంగా పెన్షన్ అందిస్తోందనిఎమ్మెల్యే గళ్ళా మాధవి గుర్తుచేశారు. అటువంటి బాధల నుంచి చిన్నారులను కాపాడి 'తలసేమియా రహిత భారత్'ను నిర్మించాలనే బలమైన సంకల్పంతో, 79 ఏళ్ల వయసులో కూడా డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి అందరినీ ఏకం చేసి ప్రతి క్యాంపస్‌లో రక్తదాన శిబిరాలు నిర్వహించడంఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా వేలాది మంది ప్రాణాలను నిలబెడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారని, ఆవిడ సంపూర్ణ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఇలాంటి సేవలనుకొనసాగించాలనిభగవంతుడినిప్రార్థించారు.ఈ బృహత్తరకార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్న దుర్గాప్రసాద్ ని, సంస్థ సిబ్బందిని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభినందించారు. ప్రజాప్రతినిధులను ఇందులో భాగస్వాములను చేయడం వల్ల సమాజంలో పదిమందికి స్ఫూర్తి లభిస్తుందన్నారు. అలాగే రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు నాయుడు, లోకేష్ చేస్తున్న కృషికిప్రజా చైతన్యంలోనూ, ఎన్నికల అవగాహనలోనూ శ్రీ చైతన్య సంస్థలు ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటూ అందిస్తున్న సహకారం మరువలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య సంస్థల ప్రతినిధి దుర్గాప్రసాద్, పలు విభాగాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది, రక్తదాతలు పాల్గొన్నారు.

కక్కెర దాసయ్య కంపెనీ గోడౌన్‌లోనిమొక్కజొన్నలను తక్షణమే తరలించాలి -- మాదాసు భాను ప్రసాద్ డిమాండ్



చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 06 :

చిలకలూరిపేట పట్టణంలోని పసుమర్రు రోడ్డులో ఉన్న కక్కెర దాసయ్య కంపెనీ గోడౌన్‌లో భారీగా నిల్వ ఉంచిన మొక్కజొన్నల వల్ల ముక్కుపురుగులు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని, దీనివల్ల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రముఖ అడ్వకేట్, సామాజికవేత్త మాదాసు భాను ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.గతంలోనూ ఇదే గోడౌన్‌లో ధాన్యాలు నిల్వ ఉంచిన సమయంలో సుమారు 1.5 కిలోమీటర్ల పరిధి వరకు ముక్కు పురుగులు వ్యాపించాయని ఆయన గుర్తు చేశారు. ఆ సమయంలో స్థానికుల ఇళ్లలోని ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకులు పూర్తిగా పాడైపోయాయని, అంతేకాకుండా స్థానిక ఆసుపత్రులు, విద్యాసంస్థలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని తెలిపారు. ప్రస్తుతం మళ్లీ అటువంటి పరిస్థితిపునరావృతమవుతుండటంతోప్రజలు ఆందోళనచెందుతున్నారని పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యాన్ని, ఆహార భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని భాను ప్రసాద్ కోరారు. గోడౌన్‌ను తనిఖీ చేసి, అక్కడ నిల్వ ఉన్న మొక్కజొన్నలను వెంటనే వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. ముక్కుపురుగుల వ్యాప్తిని పూర్తిగా అరికట్టడానికి తగిన నివారణ చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ప్రజలకు ఇటువంటి సమస్యలు తలెత్తకుండా గోడౌన్‌లో ధాన్యాల నిల్వకు ఇచ్చిన అనుమతులపై అధికారులు పునఃపరిశీలన చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పల్నాడు జిల్లా కలెక్టర్, నరసరావుపేట ఆర్డీఓ, అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మరియు చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ లకు ఫిర్యాదులు సమర్పించినట్లు ఆయన తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 6,

ఎన్టీఆర్ జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ జగ్గయ్యపేటలోని ఎస్.జి.ఎస్. కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కౌంటింగ్ హాళ్లలో టేబుళ్లు, బారికేడ్లు, సిబ్బంది విధుల కేటాయింపు, కౌంటింగ్ ఏజెంట్ల సీటింగ్ ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

జిల్లాలోని 3 డివిజన్లు, 16 మండలాల పరిధిలో 16 జడ్పీటీసీ, 276 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా, ఓట్ల లెక్కింపు కోసం జిల్లా వ్యాప్తంగా 9 ప్రాంతాల్లో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు



కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ విధుల కోసం సుమారు 1,500 మంది సిబ్బందిని, భద్రత కోసం మరో 1,500 మంది పోలీసులను నియమించినట్లు వెల్లడించారు.నవంబర్ 7వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. కౌంటింగ్ సిబ్బంది ఉదయం 6 గంటల 30 నిమిషాల నుంచి 7 గంటల మధ్య కేంద్రాలకు చేరుకోవాలని, రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 7 గంటలకల్లా తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.తొలుత బ్యాలెట్ పేపర్లను నిబంధనల ప్రకారం వర్గీకరించి, అనంతరం జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపును ఏకకాలంలో చేపట్టనున్నట్లు తెలిపారు.

కౌంటింగ్ సమయంలో ఏజెంట్లు తమకు కేటాయించిన స్థానాల్లోనే ఉండాలని, ఎన్నికల అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. మీడియా ప్రతినిధులు కూడా నిర్దేశించిన ప్రాంతాల నుంచే కవరేజ్ చేయాలని, ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా సహకరించాలని కోరారు.

ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు సమన్వయంతో వ్యవహరిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు.ఈ తనిఖీల్లో నందిగామ ఆర్డీవో అనిల్ కుమార్, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు చిన్నారులకు అండగా కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం..



పెన్ పవర్, నవంబర్ 06 :

కల్వకుర్తి మండలం కుర్మిద్ద గ్రామానికి చెందిన మల్లేష్ –నాగలక్ష్మి దంపతులు ఇటీవల మరణించడంతో వారి ముగ్గురు పిల్లలు అశ్విత,అశ్వంత్,జశ్వంత్ తల్లిదండ్రుల ప్రేమకు దూరమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం చిన్నారులకు అండగా నిలిచారు.ఈ సందర్భంగా ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ తరపున రూ.10,000 ఆర్థిక సహాయం అందించడంతో పాటు,ముగ్గురు పిల్లల విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు పూర్తి విద్యా బాధ్యతను తీసుకుంటున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలయ్య,కౌన్సిలర్‌రాము,కుర్మిద్ద ఉపసర్పంచ్ నాగరాజు,మార్చాల ఉపసర్పంచ్ నిజాముద్దీన్,బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పర్వతాల్ గౌడ్,మార్చాల మాజీ ఎంపీటీసీ మల్లేష్,మార్చాల మాజీ ఉపసర్పంచ్‌మదన్‌మోహన్‌రావు,కుమార్,బీసాశ్రీను,ఈశ్వర్,రఘు నందన్ చారి,శ్రీరామ్ రెడ్డి,కొమ్ము రాజు,మధు,నేరేటి శేఖర్,నాగేష్ గౌడ్,సూరి,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నగర సమగ్ర అభివృద్ధిపై రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ చర్చ

గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 6,

గుంటూరు నగర అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలపై రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ చర్చించారు.నవంబర్ 6న గుంటూరులోని రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ కార్యాలయానికి నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ మర్యాదపూర్వకంగా విచ్చేశారు.ఈ సందర్భంగా భాష్యం రామకృష్ణ మేయర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య వ్యవస్థ బలోపేతం, తాగునీటి సరఫరా విస్తరణ, రహదారుల అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, నగర సౌందర్యీకరణ వంటి అంశాలపై ఇరువురు సమగ్రంగా చర్చించారు.

గుంటూరు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అవసరమైన తోడ్పాటు అందిస్తామని రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగరాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో నగర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సానుకూల చర్చ జరగడంతో పాటు, గుంటూరు నగర ప్రగతికి సమిష్టిగా కృషి చేయాలని ఇరువురు సంకల్పించారు.





ఐదేళ్లు లెక్కలేనన్ని పాపాలు చేసిన జగన్.. ఎన్నికల్లో లోపాల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది : ప్రత్తిపాటి

సీఎంగా విపత్తుల బారిన పడిన వారికి జగన్ ఏనాడైనా అండగా నిలిచారా? నేనున్నానని ధైర్యం చెప్పాడా? రోడ్లు దెబ్బతిని , బురద మేటలు వేసి రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న చోట్లే పరిస్థితి మెరుగుపడాల్సి ఉంది. మిగిలిని కొద్దిపాటి పనులన్నీ శనివారం నాటికి పూర్తవుతాయి : ప్రత్తిపాట



చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 06 :

ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు, నాయకుల మధ్య పరస్పర విమర్శలు సహజమే. కానీ వాస్తవాల్ని పూర్తిగా వక్రీకరిస్తూ, తాను చెప్పే అబద్ధాలే ప్రజలు నమ్మాలనే భ్రమల్లో బతుకుతూ, పదేపదే ప్రభుత్వం.. వ్యవస్థలపై నిరాధార ఆరోపణలు చేయడమే లక్ష్యంగా జగన్.. వైసీపీనేతలు తమ నోళ్లకు పనిచెబుతున్నారు. ఐదేళ్లు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పూర్తిగా అపహాస్యం చేసిన జగన్. నేడు ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని గొంతు చించుకోవడం హాస్యాస్పదంగా ఉంది.జగన్ పాలనలో ఓటర్ల చేతులపై రక్తపు మరకలు... కూటమి ప్రభుత్వంలో ఓటర్ల వేళ్లపై సిరా చుక్కలు ముఖ్యమంత్రిగా ఐదేళ్లు ప్రజల్ని పీడించి, ఎన్నికల్ని అత్యంత హింసాత్మకంగా మార్చిన జగన్..ఒకసారి తన ఆటవిక పాలనను గుర్తు చేసుకోవాలి. 2024 సార్వత్రిక ఎన్నికలు, తాజా స్థానిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా, నిస్సంకోచంగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రజా ప్రభుత్వంలో స్వేచ్ఛగా ఓటర్ల వేళ్లపై సిరా చుక్కలుంటే, జగన్ ప్రభుత్వంలో ఎన్నికల బరిలో నిలిచిన ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు, ఓటర్ల చేతులే రక్తపు మరకలతో తడిసిపోయాయి. జగన్ పాలనలో ఎన్నికలు అత్యంత పాశవికంగా, అప్రజాస్వామికంగా జరిగాయని చెప్పడానికి ఆనాడు వారి చేతులకు అంటిన రక్తపు మరకలే నిదర్శనం. ఐదేళ్లు లెక్కకుమిక్కిలి పాపాలు చేసిన వారు.. ఎన్నికల ప్రక్రియలో లోపాల గురించి మాట్లాడుతుంటే ప్రజలు అసహ్యించుకుంటున్నారు. తాను గెలిస్తే ప్రజాస్వామ్యం బతికిందని, ఇతరులు గెలిస్తే పతనమైందన్న జగన్ వంకర మాటల్లోనే ఆయన ధోరణి ఏమిటో తెలిసిపోతోంది. ఆరోపణలు చేయడం సులభం.. కానీ వ్యవస్థలను సన్మార్గంలో నడిపిస్తూ, ప్రజాసమస్యల్ని పరిష్కరించడమే అత్యంత దుర్లభమని జగన్ గ్రహించాలి.సీఎంగా ఏనాడైనా జగన్ విపత్తుల బాధితులకు అండగా నిలిచాడా? నేనున్నానని ధైర్యం చెప్పాడా? తాను సీఎంగా ఉన్నప్పుడు తుఫాన్లు, విపత్తుల బారిన పడిన బాధితులకు జగన్ అండగా నిలిచాడా నేనున్నాను మిమ్మల్ని ఆదుకుంటానని ఒక్కరికైనా ధైర్యం చెప్పాడా? మొక్కుబడిగా నలుగురైదుగురు అధికారులు, నాయకులతో తూతూమంత్రపు సమీక్షలు చేసి, తన అవినీతి మీడియాలో ఆకాశానికి ఎత్తించుకొని, ప్రజల్ని ఆదుకున్నట్టు ప్రచారం చేసుకున్న జగన్ మోసపూరిత పాలనను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు. నేడు కూటమిప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా సమస్యల ముంగిటకు వెళ్లి, వాటిని ఎదుర్కొంటున్నవారితో మాట్లాడి, వారికి కొండంత అండగా నిలుస్తున్నారు. వయసును, ఆరోగ్యాన్ని లెక్కచేయక, ప్రజా క్షేమమే తన క్షేమంగా భావిస్తూ, వారి కష్టసుఖాలు తెలుసుకుంటూ భరోసా కల్పిస్తున్నారు. చంద్రబాబుపై పదేపదే వెకిలి విమర్శలు చేసే జగన్.. పనితీరులో ఆయనకు ఏమాత్రం సరితూగడనేది అందరికీ తెలిసిందే. వాస్తవాలకు విరుద్ధంగా విశ్వసనీయత లేని విమర్శలతో కాలం వెళ్లబుచ్చుతూ, జగన్ తనను తాను మోసం చేసుకుంటూ, నమ్ముకున్న పార్టీశ్రేణుల్ని కూడా ముంచేస్తున్నాడు.

'మరసు' నష్టనివారణ చర్యలు 90 శాతం పూర్తయ్యాయి. మిగిలినవి రేపటిలోగా పూర్తవుతాయి మురసు ప్రభావంతో అస్తవ్యస్తమైన నియోజకవర్గంలో పరిస్థితులు క్రమక్రమంగా చక్కబడుతున్నాయి. శుక్రవారం సాయంత్రానికి నియోజకవర్గవ్యాప్తంగా 80 శాతం వరకు విద్యుత్ పునరుద్ధరణ పూర్తయింది. మరికొన్ని చోట్ల బురదమేటలు, నేలకూలిన చెట్ల తొలగింపులో జాప్యం కారణంగా విద్యుత్ లైన్ల ఏర్పాటు వీలుకాలేదు. అలానే నీట మునిగిన పంటల్ని క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది, నష్టం వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ యాప్ లలో నమోదు చేస్తున్నారు. ఆ ప్రక్రియ పూర్తి కావడానికి మరికొంత సమయం పట్టవచ్చు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజాజీవనం చాలావరకు మెరుగుపడింది. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు తగ్గకపోవడం, రోడ్లపై పేరుకున్న బురద తొలగింపు సాధ్యం కానందున 20శాతం వరకు పనులు పూర్తికాలేదు. మొత్తంగా పట్టణ పరిధిలో 80శాతం వరకు పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజ్ ల్లోని చెత్త, పూడిక తొలగింపు, తాగునీటి సరఫరా మెరుగుపడింది, తుపాన్ ప్రభావంతో నియోజకవర్గంలో 10కి.మీ మేర ఆర్ఆబీ రోడ్లు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతులకు సంబంధించి శాఖాపరమైన అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించడం జరుగుతుంది. పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, మున్సిపల్, విద్యుత్, వ్యవసాయ, రెవెన్యూశాఖల పరిధిలో 80 నుంచి 90 శాతం వరకు నష్ట నివారణ చర్యలు పూర్తయ్యాయి. మిగిలిన ఆ కొద్దిపాటి పనులు కూడా శనివారం నాటికి పూర్తిచేయాలని అన్ని శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

18వ వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని రేఖరాణి ఘన విజయం

చీరాల, నవంబరు 6 (పెన్ పవర్) :

చీరాల మున్సిపల్ స్థానిక ఎన్నికల్లో 18వ వార్డు నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినిగా పోటీ చేసిన రేఖరాణి విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఓట్లు వేసి గెలిపించిన వార్డు ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తన గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ఎలాంటి సమస్య వచ్చినా సానుకూలంగా స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఈ విజయం తనపై నమ్మకం ఉంచి ఓటు వేసిన ప్రజలదేనని, ప్రజలు తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేఖరాణి స్పష్టం చేశారు.



చీరాల మున్సిపాలిటీపై టీడీపీ జెండా.. చైర్మన్‌గా హనీ స్పందన ఘన విజయం!

6,468 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపు.. 40 ఏళ్లకు పైబడిన టీడీపీ చరిత్రలో తొలిసారిగా మున్సిపాలిటీ కైవసం



చీరాల, నవంబర్ 6, (పెన్ పవర్):

బాపట్ల జిల్లా చీరాల మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. టీడీపీ చైర్మన్ అభ్యర్థి హనీ స్పందన తన ప్రత్యర్థులపై 6,468 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. దీంతో చీరాల మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది.

టీడీపీ ఆవిర్భావం తర్వాత 40 ఏళ్లకు పైబడిన పార్టీ చరిత్రలో తొలిసారిగా చీరాల మున్సిపాలిటీపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేయడం విశేషంగా నిలిచింది. ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య నాయకత్వంలో పార్టీ ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలకొండయ్యకు, చైర్మన్‌గా విజయం సాధించిన హనీ స్పందనకు, గెలుపొందిన కౌన్సిలర్ అభ్యర్థులందరికీ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు. ఈ విజయంతో టీడీపీ శ్రేణుల్లో సంబరాలు అంబరాన్నంటాయి.

ప్రజాస్వామ్యాన్ని అడ్డుకునేందుకు వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా ప్రజాతీర్పును అడ్డుకోలేరు: మంత్రి ఆనం

(పెన్ పవర్) నెల్లూరు

నెల్లూరు రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని, మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.

నేడు నెల్లూరు నగరంలోని సంతపేటలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం ఆనం రామనారాయణరెడ్డి నిర్వహించినారు. ఈ సందర్భంగా మంత్రి, మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, ఎన్డీఏ కూటమి విజయాలు, బీసీలకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రాధాన్యత, ఆత్మకూరు నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలపై మాట్లాడారు.

గత నెల రోజులుగా అధికార, ప్రతిపక్ష పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండున్నరేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లామని తెలిపారు. ప్రజలకు చేరువైన పాలన అందించడం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడమే ఎన్డీఏ కూటమి ప్రధాన లక్ష్యమన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్, బీజేపీ, జనసేన నాయకులు సమన్వయంతో పనిచేయడం వల్లే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిందని పేర్కొన్నారు. ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని, ప్రజాస్వామ్యబద్ధంగా, రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించామని చెప్పారు.

స్థానిక సంస్థలకు కేంద్ర నిధులు రావాలంటే ఎన్నికలు సజావుగా జరగాలి : మంత్రి ఆనం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే ప్రతి రూపాయి ప్రజలకు చేరాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని మంత్రి తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ముందుకు





సాగుతున్నామన్నారు. 16వ ఆర్థిక సంఘం ద్వారా గతంలో స్థానిక సంస్థలకు సుమారు రూ.6,400 కోట్ల నిధులు అందాయని, ప్రస్తుత ఆర్థిక కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్‌కు సుమారు రూ.12 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు వివరించారు.

బీసీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించడమే ఎన్డీఏ కూటమి నిబద్ధత: మంత్రి ఆనం

బీసీల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని మంత్రి గుర్తుచేశారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన నాటి నుంచి బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించి, రాజ్యాధికారంలో భాగస్వాములను చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో మరింత చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో వైసీపీ నాయకులు కోర్టులను ఆశ్రయిస్తూ అడ్డంకులు సృష్టించారని విమర్శించారు. అయినప్పటికీ బలహీన వర్గాలకు న్యాయం చేయాలన్న లక్ష్యంతో ఎన్డీఏ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. నెల్లూరు నగర మేయర్ పదవిని బీసీ వర్గానికి చెందిన రూప్ కుమార్ యాదవ్‌కు కేటాయించడం బీసీలపై కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. జనరల్ కేటగిరీకి వచ్చిన అవకాశాన్ని బీసీ వర్గానికి కల్పించడం ద్వారా బీసీలకు ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యత ఇస్తుందో స్పష్టమవుతోందన్నారు. బలహీన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత వైసీపీ పాలనలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలు చించడం, అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని మంత్రి విమర్శించారు.

నిన్న ఆత్మకూరు నియోజకవర్గం లో జరిగిన ఘటనలపై మంత్రి వివరణ

ఆత్మకూరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నుంచి పోలింగ్ వరకు ప్రతి మండలాన్ని, ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ తాను స్వయంగా గడపగడపకు వెళ్లానని మంత్రి తెలిపారు. ఎన్నికల సమయంలో కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు జరుగుతున్నట్లు సమాచారం అందిందని, ముఖ్యంగా ఒక పోలీసు కానిస్టేబుల్ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారనే ఫిర్యాదు తన దృష్టికి వచ్చిందని వివరించారు.

ఈ విషయాన్ని గుర్తించిన వెంటనే తాను అక్కడికి వెళ్లి, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి పక్షపాతం లేకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత పోలీసు సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. అనంతరం ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని వివరించానని, అయితే డీఎస్పీ అక్కడికి చేరుకోవడానికి సుమారు రెండు గంటల సమయం పట్టిందని పేర్కొన్నారు.

కొన్ని పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు జరుగుతు న్నాయనిపోలీసులకు తెలియజేసినా తగిన సహకారం అందలేదని ఆరోపించారు. ఇదే సమయంలో వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే సుమారు వంద మంది అనుచరులతో అక్కడికి వచ్చి తమను బెదిరించే ప్రయత్నం చేశారని, జరిగిన వాస్తవాలను పక్కదారి పట్టించేలా ఈ ఘటనను వివిధ రకాలుగా చిత్రీకరించారని విమర్శించారు. అనంతసాగరం మండలంలో రిగ్గింగ్‌కు ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారం అందడంతో తాను హుటాహుటిన అక్కడికి వెళ్లానని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సిబ్బంది, పోలీసు భద్రత ఉన్నప్పటికీ ఇలాంటి పరిస్థితులు ఎందుకు తలెత్తాయో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చూడాలన్నదే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు.

రౌడీయిజం, బెదిరింపులకు భయపడేది లేదు.. రాజకీయాల్లో హద్దులు దాటొద్దు: మంత్రి ఆనం

తన రాజకీయ అనుభవంలో సగం కూడా లేని నాయకులు రాజకీయాలు నేర్పించడానికి వస్తే సహించేది లేదని మంత్రి ఘాటుగా వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు వరకు లాగుతామంటూ బెదిరింపులకు దిగడం, పోలింగ్ కేంద్రాల వరకు అనుచరులను తీసుకువచ్చి భయభ్రాంతులకు గురిచేయడం ఏ రకమైన ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు.

నెల్లూరు జిల్లాకు రాజకీయంగా ఎంతో చరిత్ర ఉందని, ఆనం కుటుంబానికి కూడా సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉందని గుర్తుచేశారు. రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలని, వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడితే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నెల్లూరు జిల్లాలో గతంలో నాటుబాంబుల సంస్కృతిని ప్రోత్సహించిన చరిత్ర ఎవరిదో ప్రజలకు తెలుసని, దోపిడీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆస్తుల కబ్జాలు, దౌర్జన్యాల ఆరోపణలపై సంబంధిత నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. NHAIకి సంబంధించిన రూ.145 కోట్ల వ్యవహారంపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. రాజకీయాల్లో వ్యక్తిగత దాడులకు దిగకుండా ప్రజా సమస్యలపై చర్చించాలని సూచించారు.

అయితే చేజర్ల మండలంలో చంద్రశేఖర్ అనే వైసీపీ నాయకుడి అనుచరులు అల్లర్లు సృష్టించి కొందరిపై దాడులకు పాల్పడినట్లు సమాచారం ఉందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై దాడులకు దిగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇది వైసీపీ నాయకుల దౌర్జన్య వైఖరికి నిదర్శనమన్నారు.

మేము గతంలో మాదిరిగా రాక్షస పాలనలో లేమని, రాజ్యాంగబద్ధంగా పాలన సాగిస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఉన్నామని స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవిస్తూ పాలన అందిస్తున్నామని, రాజ్యాంగాన్ని ధిక్కరించేలా ఎవరైనా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకుడు నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ నాయకత్వంలో ఎన్డీఏ కూటమి నేతలందరం ఒకే మాటపై నిలబడి ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. వైసీపీ నాయకులు ఎన్నికలు ప్రశాంతంగా జరగడాన్ని కూడా జీర్ణించుకోలేకపోతున్నారని, ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కోరుకుంటున్నారని, విధ్వంసకర రాజకీయాలను కాదని స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి పట్టణం అభివృద్ధి చెందేలా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు.

ఓట్ల లెక్కింపు- బరిలో 651 మంది.. ఎవరి జయకేతనం!



నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 06

జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం 574 మంది ఎంపీటీసీ, 77 మంది జెడ్పీటీసీ అభ్యర్థులు కలిపి మొత్తం 651 మంది అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. కౌంటింగ్ కోసం సుమారు 1,200 మంది సిబ్బందిని నియమించనున్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల్లోపు లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు.

కౌంటింగ్ కేంద్రాలు, మండలాల వివరాలు

నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నంద్యాల, గడివేముల, పాణ్యం, గోస్పాడు మండలాల ఓట్లను లెక్కిస్తారు. మహానంది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహానంది మండలం ఓట్ల లెక్కింపు చేపడతారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సిరివెళ్ల, బండి ఆత్మకూరు మండలాల ఓట్లను లెక్కిస్తారు. నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని మండలాల ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. ఆత్మకూరులో ఆ నియోజకవర్గ పరిధిలోని మండలాల ఓట్లను లెక్కిస్తారు. ఆళ్లగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఐదు మండలాల ఓట్ల లెక్కింపు చేపడతారు. డ్రోన్‌లోనూ కౌంటింగ్ నిర్వహించనున్నారు.కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు శివశంకర్ తెలిపారు.

ఈ వెస్ట్ పై అవగాహనా మెప్మా

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్ 6.

బ్రిక్స్ సమావేశం జరిగిన అవగాహన ఒప్పందంలో భాగంగా భారత ప్రభుత్వం యొక్క సందేశం మేరకు మెప్మా ఆధ్వర్యంలో వారం రోజుల బ్రిక్స్ కార్యక్రమాలను నిర్వహించడం జరిగినది.

సుస్థిరమైన జీవన ప్రమాణాలు అలవర్చు కొనుటకు వారం రోజులు కార్యక్రమాలు చేపట్టినారు. అందులో భాగంగా ఈరోజు ఈ వేస్ట్ పై ర్యాలీ నిర్వహించడం జరిగింది అంతేకాకుండా ప్రజల్లో ఎలక్ట్రానిక్ వేస్ట్ యొక్క ప్రమాదము, వాటిని ఇళ్లల్లో ఉంచుకున్నందువల్ల ఇబ్బందులు,ఆ రేడియేషన్ కి కుటుంబంలో వచ్చేటువంటి ఇబ్బందులు, ఆ నేటివ్ ఎనర్జీని ఎదుర్కునేందుకు తీసుకోవాల్సిన చర్యలు. అదేవిధంగా ఇంట్లో పనికిరాని అటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను వెంటనే అవి కలెక్ట్ చేసుకుని మార్కెట్లో అమ్మి వేయవలెనని, ప్రతి పొదుపు సభ్యురాలికి తెలియచేయటం జరిగింది. ఆ విధంగా ఇంట్లో చార్జర్లు గానే బ్యాటరీలు కానీ ఇతర ఏ ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా పనికిరాని అటువంటి వాటిని ఇంట్లో ఉంచుకోకుండా ఆ వస్తువులన్నీ కూడా బయట వారికి అమ్మటం కానీ లేదా వాటిని నాశనంచేయడంగానిచేయవలెనని ఈ కార్యక్రమాన్నిఉద్దేశించి సి ఓ నర్మదా వివరించారు. ఈ కార్యక్రమంలో సి ఓ నర్మదా ఆర్పీలు మరియు ఇతర లీడర్లు పొదుపు సంఘ సభ్యులు పాల్గొన్నారు



ప్రజల గొంతుక.. కాంగ్రెస్ బలోపేతానికి బత్తయ్యే సరైన నాయకుడు

- శ్రీకాళహస్తి మండల కాంగ్రెస్ పగ్గాలు ఎన్. బత్తయ్యకు ఇవ్వాలి

- ప్రజాభిమానమే బత్తయ్య బలం.. మండల అధ్యక్ష పదవికి ప్రజల బలమైన డిమాండ్!

శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,నవంబర్ 06:

శ్రీకాళహస్తి మండల కాంగ్రెస్ పార్టీకి కొత్త జోష్ తీసుకురావాలంటే ప్రజలతో మమేకమై, సేవా దృక్పథంతో పనిచేస్తున్న ఎన్. బత్తయ్యకు మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని ప్రజలు బలంగా కోరుతున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేసే నాయకుడిగా బత్తయ్యకు మంచి గుర్తింపు ఉందని ప్రజాభిప్రాయం వ్యక్తమవుతోంది.



ప్రజలతో అనుబంధం.. సేవలో నిబద్ధత.. నాయకత్వంలో చొరవ ఈ లక్షణాలున్న ఎన్. బత్తయ్యకు కాంగ్రెస్ మండల పగ్గాలు అప్పగిస్తే పార్టీ గ్రామస్థాయిలో మరింత బలోపేతమవుతుందని, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపడంతో పాటు ప్రజల్లో పార్టీకి ఆదరణ పెరుగుతుందని ప్రజలుఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలఆకాంక్షకు ప్రాధాన్యతనిస్తూ, ఎన్.బత్తయ్యకుశ్రీకాళహస్తిమండలకాంగ్రెస్ అధ్యక్ష పదవికల్పించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుడికి, నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్తకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

శానిటరీ కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం

- జాతీయ న్యాయ సేవల వారోత్సవాల్లో న్యాయ విజ్ఞాన సదస్సు, అవగాహన ర్యాలీ



శ్రీకాళహస్తి, పెన్ పవర్, నవంబర్ 06:

జాతీయ న్యాయ సేవల వారోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తిలోని 11వ వార్డు సచివాలయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం న్యాయవాదులు గరికిపాటి రమేష్, రాజేశ్వరరావు, పారా లీగల్ వాలంటీర్ల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ, కార్మిక చట్టాలు, రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళలకు పురుషులతో సమానంగా చట్టపరమైన హక్కులు ఉన్నాయని, చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకోవాలని తెలిపారు. న్యాయస్థానాలు అందరికీ సమాన న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు.

మహిళలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా న్యాయస్థానాలను ఆశ్రయించి తమ హక్కులను కాపాడుకోవచ్చని వివరించారు. ఉచిత న్యాయ సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. శ్రీకాళహస్తి కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. పారా లీగల్ వాలంటీర్ల ద్వారా తమ సమస్యలను తెలియజేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని న్యాయవాదులు స్పష్టం చేశారు.

దెబ్బతిన్న తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు..

ప్రజలకు నీటి ఇబ్బందులు తొలగింపు

- ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాలతో స్పందించిన టీడీపీ నాయకులు

ఏర్పేడు, పెన్ పవర్, నవంబర్ 06:





శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాలు, ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడుసహకారంతోముసలి పేడు గ్రామ బీసీ కాలనీలో దెబ్బతిన్నతాగునీటి పైపులైన్లకు మరమ్మతులు చేపట్టారు.ఆర్డీఎక్స్ విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా దెబ్బతిన్న పైపులైన్లను మాజీ సర్పంచ్, బూత్ ఇంచార్జి వై. మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో జాయింట్లు చేసి పునరుద్ధరించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టడం విశేషం.

ఈ కార్యక్రమంలో ఫిట్టర్లు పి. తులసి, ఎం. మణి, గ్రామస్తులు పాల్గొని సహకారం అందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు చొరవ చూపడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంపీటీసీ,జెడ్ పి టి సి, కౌంటింగ్‌కు పటిష్ట పోలీస్ బందోబస్తు

- సుమారు 150 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు.. నిబంధనలు పాటించాలని ఎస్‌డీపీఓ బి. పావని సూచన



శ్రీకాళహస్తి, పెన్ పవర్,నవంబర్ 06:

స్కిట్ కళాశాలలో నిర్వహించనున్న తొట్టంబేడు, రేణిగుంట, ఏర్పేడు మండలాల ఎంపీటీసీ,జెడ్ పి టి సి, ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా సుమారు 150 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు శ్రీకాళహస్తి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ బి. పావని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున ఎవరూ గుంపులుగా సంచరించరాదని సూచించారు. ఏజెంట్ ఫారం కలిగిన వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని, సెల్‌ఫోన్లకు లోపల ప్రవేశం లేదని స్పష్టం చేశారు. ఫోన్లను బయటే ఉంచి రావాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించి, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా నిబంధనలు పాటించాలని ఎస్‌డీపీఓ బి. పావని విజ్ఞప్తి చేశారు.

నవంబర్ 23న వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు

18న నోటీసులు జారీ

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 06



నంద్యాల మున్సిపాలిటీలో వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వుల ప్రతిని మీడియా ప్రతినిధులకు అందజేశారు. షెడ్యూల్ ప్రకారం నవంబర్ 18న ప్రత్యేక సమావేశానికి సంబంధించి నోటీసులు జారీ చేయనున్నారు. నవంబర్ 23వ తేదీ ఉదయం 11 గంటలకు వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియను చట్ట నిబంధనలు, ఎన్నికల నియమావళికి అనుగుణంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులను ఆదేశించింది.

ఈ-వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు

- బాధ్యతాయుత నిర్వహణతోనే నివారణ

మెప్మా పీడీ వెంకట దాస్

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 06



ఈ-వ్యర్థాల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగావ్యవహరించాలని మెప్మా పీడీ వెంకట దాస్ సూచించారు.

బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని సీఆర్‌సీ భవనంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈ-వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరం లేని ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేయకుండా, పాడైన వాటిని మరమ్మతు చేసి తిరిగి వినియోగించాలని సూచించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సాధారణ చెత్తలో వేయకుండా ఆర్ఆర్ఆర్ కేంద్రాలకు అందించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెప్మా ఏఓ ఆసిఫ్ బాషా, సీఏంఎం విజయభాస్కర్ రెడ్డి, సీఓ చంద్ర విద్యాసాగర్, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై కమిషనర్ తనిఖీ

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 06



నంద్యాల పట్టణంలో పారిశుధ్య పనులు నిరంతరం పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఉదయం నంద్యాల పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటించి పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీధులు, రహదారులు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి స్పష్టం చేశారు. పారిశుధ్య పనుల్లో నాణ్యత పెంచి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, పారిశుధ్య పర్యవేక్షకులు మురళీధర్, లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

టపాసుల అక్రమ వ్యాపారం చేస్తే ఖబడ్దార్!

అనుమతులు లేకుండా నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు.

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 06



ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ హెచ్చరించారు. పేలుడు పదార్థాల చట్టం ప్రకారం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

దీపావళి టపాసుల విక్రయదారులు తప్పనిసరిగా లైసెన్సులు పొందాలని, జనసంచారం, నివాస ప్రాంతాలకు దూరంగా బహిరంగ మైదానాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి దుకాణంలో నీరు, ఇసుక, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలని, చిన్నపిల్లలను విక్రయ పనుల్లో నియమించరాదన్నారు.

కూటమి పాలన మెచ్చి రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పు నేటి ఫలితాలు.

- ఈవీఎం అయినా బ్యాలెట్ పేపర్ అయినా... మున్సిపల్ అయినా జడ్పీ, పంచాయతీ అయినా ఎన్నిక ఏదైనా గెలుపు కూటమి పార్టీలదే

- ముఖ్యమంత్రిగా పనిచేసి , వైస్సార్సీపీ అధ్యక్షుడిగా ఉన్న జగన్ కు ఓటు వేసే ఓపిక లేకపోవడం విచారకరం.

- స్థానిక సంస్థల ఎన్నికల వ్యవస్థ గురించి మాట్లాడే అర్హత జగన్ కు, వైస్సార్సీపీ నేతలకు లేదు.

- 2024 ఎన్నికలకు మించిన విజయాన్ని నేడు కూటమి పార్టీలకు అందించిన ప్రజలకు ధన్యవాదములు.

- మున్సిపల్ ఎన్నికల ఫలితాలకు మించిన విజయాన్ని జడ్పీ, పంచాయతీ ఎన్నికల్లో సాధిస్తాం.

- బీద రవిచంద్ర, శాసనమండలి సభ్యులు, టీడీపీ జిల్లా అధ్యక్షులు.

నెల్లూరు (పెన్ పవర్):

నెల్లూరు నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో శాసనమండలి సభ్యులు, జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, పిల్ రావు, మనుబోలు శ్రీధర్ రెడ్డి, మాతంగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బీద మాట్లాడుతూస్థానిక సంస్థల ఎన్నికల నుండి ఎలాగైనా తప్పించుకోవాలని జగన్ స్థాయి నుండి వైసీపీ కార్యకర్త స్థాయి వరకు కోరుకున్నారు.

మోసపూరితంగా రిజర్వేషన్ వివాదంను వైసీపీ నేతలు సృష్టించారు, న్యాయస్థానాల్లో పిటిషన్లు వేసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నారు.





నాటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ ను కమ్మవాడని జగన్ అవమానించారు. అధికారులను కులాలతో ముడిపెట్టి భయభ్రాంతులకు గురి చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల మీద వైసీపీ నేతలు సుప్రీంకి వెళ్లారు....ఎన్నిసార్లు డేటు మార్చినా ప్రజా అభిప్రాయాన్ని మార్చలేకపోయారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయాన్ని చూసి ఈవీఎమ్ లతో గెలిచామన్నారు, నేడు బ్యాలెట్ పేపర్లతో కూడా 2024కు మించి ఘన విజయం సాధించాం.

2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను కనీసం నామినేషన్లు వేయనివ్వలేదు. టీడీపీ గెలిచిన స్థానాలను ప్రకటించనివ్వలేదు.

నేటి స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ నేతలు దూరంగా పారిపోయారు.

కొందరు తప్పులు తడకలుగా నామినేషన్లు వేసి ఎన్నికల నుంచి తప్పించుకోవడంతో పాటు కూటమి పార్టీల నేతలపై బురద చల్లుతున్నారు.

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం పెట్టుబడులు, ఉద్యోగ కల్పన కోసం ప్రతి రంగాన్ని అభివృద్ధి పథంలోముందుకుతీసుకెళ్లేందుకు నారాచంద్రబాబునాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ కృషి చేస్తున్నారు.

రాష్ట్ర ప్రజలు కూటమి పాలనను కోరుకుంటున్నారు, కూటమి పాలనతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి ఓటు రూపంలో తమ అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేశారు, వైసీపీ నేతలు ఇప్పటికైనా నాటకాలు కట్టి పెట్టండి.

సర్ ఓటర్ లిస్టు ద్వారా లక్షలాదిమంది వైసీపీ అభిమానుల ఓట్లు తొలగిస్తున్నారని తమకు పాత ఓటర్ లిస్టుతోనే ఎన్నికలు జరపాలని ఆందోళనలు చేశారు.

ఎన్నికలను ఏ ఓటర్ లిస్టు ప్రకారం నిర్వహించాలో నిర్ణయించేది ఎన్నికల సంఘమే తప్ప కూటమి పార్టీలు కాదన్న సంగతి వైస్సార్సీపీ నేతలకు తెలియకపోవడం విచారకరం.

కొత్త ఓటర్ లిస్టు(సర్) వచ్చేందుకు ఆలస్యం కానుండడం,అప్పటివరకుఎన్నికలునిర్వహించకపోవడం ద్వారా మున్సిపాలిటీ – పంచాయతీ, మండల – జడ్పీలు కేంద్ర నిధులు కోల్పోయే ప్రమాదంను ప్రభుత్వం గుర్తించింది.

ఏ ఓటర్ లిస్టు ప్రకారం ఎన్నికలను జరుపగలరో నిర్ణయం తీసుకోవాలని ఏ లిస్టు ప్రకారమైనా తాము సిద్ధంగా ఉన్నామని ఎన్నికల సంఘానికి కూటమి ప్రభుత్వం తెలియజేసింది.

స్థానిక సంస్థల ఎన్నికల గురించి, ఎన్నికల వ్యవస్థ గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదు.

2021 స్థానిక సంస్థల ఎన్నికలను తాను ఎలా నిర్వహించారో జగన్ ఒక్కసారి గుర్తు చేసుకోవాలి.

వైస్ చైర్మన్ పదవిపై ఉత్కంఠ!

కౌన్సిలర్లకు గాలం.. పార్టీ మార్పులపై జోరుగా చర్చలు

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 6



నంద్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. ఈ నెల 23న ఎన్నిక జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల జారీ చేశారు. ఇప్పటి నుంచే ఇరు పార్టీల నేతలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు.

నంద్యాల మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీకి 27 మంది, టీడీపీబీజేపీ కూటమికి 25 మంది కౌన్సిలర్లు ఎన్నికయ్యారు. అదనపు ఓట్ల విషయంలో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ఓట్లు కూడా కీలకంగా మారనున్నాయి. వైస్ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు ఇరు పార్టీల నాయకులు ప్రత్యర్థి కౌన్సిలర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. పార్టీ మారకుండానే సమావేశానికి గైర్హాజరైతే సరిపోతుందనే ప్రతిపాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నెల 18 నుంచి కౌన్సిలర్లను క్యాంపులకు తరలించే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. పదవిని ఆశిస్తున్న నాయకులకు కౌన్సిలర్ల డిమాండ్లు మరో తలనొప్పిగా మారినట్లు సమాచారం.మొత్తానికి నంద్యాల వైస్ చైర్మన్ ఎన్నికకు ముందే రాజకీయ సమీకరణాలు వేడెక్కగా.. చివరి నిమిషంలో ఎవరు గోడ దూకుతారోనన్న ఉత్కంఠ పట్టణంలో నెలకొంది.

మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన డాక్టర్ పి.బాబన్ మరియు డాక్టర్ ఎస్ ఇంతియాజ్ అహ్మద్

పరస్పరం ఒకరికి ఒకరు ఘనంగా సన్మానించుకున్నారు



నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 06

వారి స్నేహం గొప్ప ఆత్మీయతకు నిదర్శనం చైర్మన్ గా గెలిచి తన ఆత్మీయ స్నేహితునికి ఘనంగా సన్మానించారు.హోదా కన్నా స్నేహం గొప్పది.ఒకరు వైద్య వృత్తిలో మరొకరు విద్య నేర్పే గురువర్యులు ఇరువురు పదవి విరమణ చేసిన గొప్ప మేధావులే ఒకరు మున్సిపల్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ సహకారంతో నంద్యాల మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికై మొట్టమొదటిసారిగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన డాక్టర్ పి.బాబన్ మరొకరు ఎందరికో విద్యాబుద్ధులు నేర్పి ఎంతోమంది జీవితాలను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన నేషనల్ విద్యాసంస్థలచైర్మన్‌డాక్టర్ఎస్.ఇంతియాజ్ అహ్మద్, గురువర్యులు, వారిరువురి స్నేహం ఇప్పటిది కాదు వారి స్నేహం కొన్ని తరాల వరకు చెప్పుకోదగ్గ స్ఫూర్తిదాయకం నంద్యాలలో మున్సిపల్ ఎన్నికలు ముగిసి చైర్మన్ అభ్యర్థిగా గెలుపొందిన డాక్టర్ పి.బాబాన్ తన ఆప్తమిత్రుడు నేషనల్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్.ఇంతియాజ్ అహ్మద్ ను కళాశాలలోని తన కార్యాలయానికి వచ్చి తన ఆప్తమిత్రుని ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన తన ఆప్తమిత్రుని కలసి ఘనంగా సన్మానించాలని డాక్టర్ ఎస్.ఇంతియాజ్ అహ్మద్ ముందుగా సమాచారం ఇచ్చారు. లేదు నేనే వస్తున్నానని డాక్టర్ పి.బాబన్ ఎన్ని పనులు ఉన్నా తన ఆప్తమిత్రుడు డాక్టర్ ఎస్.ఇంతియాజ్ అహ్మద్ ను కలుసుకునేందుకు ఆయన కార్యాలయానికి చేరుకుని ఒకరిని ఒకరు అలిగానం చేసుకొని ఒకరిని ఒకరు ఘనంగా సన్మానించుకున్నారు. తమ 70 పదుల వయసులో కూడా స్నేహానికి ఒక కొత్త నిర్వచనం పలికారు. కొంతసేపు ఇద్దరు తమ జీవిత ఆత్మీయ ప్రయాణంలో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కసేపు కబుర్లు చెప్పుకుంటూ తన్మయంలో ఉండిపోయారు. ఇంతటి మధురమైన సందర్భం ఇద్దరి ముఖాల్లో ఆత్మీయ ఆనందం స్పష్టంగా కనిపించింది. ఇంతటి గొప్ప స్నేహానికి హోదాలు ప్రామాణికం కాదని ఇద్దరు స్నేహితులను చూస్తే ఇట్టే అర్థం అవుతుంది. తనకు రాజకీయాల్లో తోడుండాలని సలహాలు సూచనలు కావాలని డాక్టర్ ఎస్.ఇంతియాజ్ అహ్మద్ ను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పి.బాబన్ కోరగానే వెంటనే స్పందిస్తూ ఎప్పుడైనా సమయపాలన లేకుండా స్నేహితునికి తోడుంటానని హామీ ఇవ్వడంతోనే ఇద్దరి ముఖాల్లో చిరునవ్వు మెరిసింది. ఈ సన్మాన కార్యక్రమంలో నేషనల్ విద్యాసంస్థల పరిపాలన అధికారి రఫీ అహ్మద్,డాక్టర్ బాబాన్ మిత్రా బృందం పాల్గొన్నారు.

టీడీపీలో సివంగులు.. వదల్లేదుగా.. !



తాజా మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ మహిళా నేతలు తమ సత్తా చాటారు. కడపలో ఎమ్మెల్యే ఆర్. మాధవి అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకు చురుగ్గా వ్యవహరించి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. మంత్రి సవిత అనంతపురం జిల్లాలో సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కూటమి అభ్యర్థుల విజయానికి పనిచేశారు. చంద్రగిరిలో పులవర్తి సుధ పోలింగ్ సమయంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అనుసరిస్తూ వ్యవహరించిన తీరు కూడా చర్చనీయాంశమైంది.

కూటమి పార్టీల్లో కీలకమైన టీడీపీలో మహిళా నేతల దూకుడు మరోసారి చర్చకు వచ్చింది. 2024 ఎన్నికల సమయంలో విజయం దక్కించుకున్న మహిళా నాయకులు.. పార్టీని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతోపాటు పురుష నేతల కంటే కూడా ఎక్కువగా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నించారు. అదేసమయంలో ఏ ఎన్నికలు వచ్చినా.. మేమున్నామని నిరూపిస్తున్నారు. తాజాగా జరిగిన మునిసిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పురుష నేతల ప్రభావం ఒకవైపు ఉన్నా.. మరోవైపు టీడీపీ మహిళా నాయకులు కూడా దూకుడు ప్రదర్శించారు.ఆర్.మాధవి: కడప కార్పొరేషన్ సహా.. తాజాగా జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను కడప ఎమ్మెల్యేగా ఉన్న రెడ్డప్పగారి మాధవి రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇక్కడ పార్టీతో పాటు తన హవాను కూడా పెంచుకునేందు కు ఆమె చేసిన ప్రయత్నం ఫలించింది. నియోజకవర్గంపై పట్టును కొనసాగించే క్రమంలో వైసీపీ నేతలకు కౌంటర్‌గా బలమైన అభ్యర్థుల ఎంపిక నుంచి ఆమె ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఫైర్ బ్రాండ్ నాయకురాలు కావడంతో నియోజకవర్గంలో ఆమె మాటే చెల్లుబాటు అయింది. ఇక, ఎన్నికల వేళలో ప్రత్యర్థులను కట్టడి చేసే విషయంలోనూ మాధవి దూకుడుగానే వ్యవహరించారు.సవిత: ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన సంజీవరెడ్డిగారి సవిత.. ప్రస్తుతం మంత్రిగా ఉన్నారు. కానీ.. ఆమె ఆది నుంచి కూడా.. జిల్లాపై బలమైన ముద్ర వేసే ప్రయత్నం చేశారు. తాజా ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకునే విషయంలో సవిత తనదైన దూకుడు ప్రదర్శించారు. ఫైర్‌బ్రాండ్ నాయకురాలు కాకపోయినా.. వివాదాలకు దూరంగా ఉన్నా.. ప్రజలను ఆకర్షించే విషయంలోను.. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని వివరించి ప్రజల ఓటు బ్యాంకును సానుకూలంగా మార్చుకునే విషయంలోనూ మంత్రి సవిత తనదైన ముద్ర వేసుకుని చాలా మునిసిపాలిటీల్లో క్లీన్‌స్వీప్ చేశారు.పులవర్తి సుధ: పార్టీ పరంగా టీడీపీలో కీలక పోస్టు లేకపోయినా.. చంద్రగిరి ఎమ్మెల్యే పులవర్తి నానీ సతీమణిగా .. జిల్లాలో పేరు తెచ్చుకున్నారు. ఎన్నికల పోలింగ్ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలోని మంగళం పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని తనదైన చాతుర్యంతో కట్టడి చేశారు. రిగ్గింగులు, ఘర్షణలు జరగకుండా.. ఆయనను అనుసరిస్తూ.. జనరల్ ఏజెంట్‌గా వ్యవహరించిన సుధా రెడ్డి, ఎన్నికలు ప్రశాంతంగా జరగాలనే ఉద్దేశంతో "చెవిరెడ్డి ఎక్కడికి వెళ్తే అక్కడికి తన వాహనంలో వెంబడిస్తానని, ఆయన వెంటే ఉంటానని" హెచ్చరించి రాజకీయంగా సంచలనం సృష్టించారు. ఇలా.. అనేక మంది మహిళా నాయకులు టీడీపీలో విశేషంగా కృషి చేయడం గమనార్హం.

జనం పట్టుబడితే అంతే.. ఏపీలో పోలింగ్ బహిష్కరణ!



ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌కు పలు గ్రామాల ప్రజలు దూరంగా నిలిచారు. రోడ్లు, తాగునీరు, వైద్యం, విద్య వంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, పోలింగ్ కేంద్రాల మార్పు, రిజర్వేషన్ల వివాదాలపై నిరసనగా సామూహికంగా ఎన్నికలను బహిష్కరించారు. విశాఖ, చిత్తూరు, అనంతపురం, అల్లూరి, తిరుపతి, అనకాపల్లి జిల్లాల్లోని పలు గ్రామాల్లో ఈ నిరసనలు కనిపించాయి. కొన్ని చోట్ల గ్రామంలోని ఓటర్లంతా ఓటింగ్‌కు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది.

అధికార కూటమి, సహా ఇతర పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌ను రాష్ట్రంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యల కారణంగా బహిష్కరిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తమ ప్రాంతాల్లో కనీస సౌకర్యాల లేమి, పోలింగ్ కేంద్రాల మార్పు, రిజర్వేషన్ల వివాదం, తారు రోడ్ల నిర్మాణానికి ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఓటర్లు పోలింగ్ ప్రక్రియకు దూరంగా నిలిచారు.

ఎక్కడెక్కడ?

1) విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం రాయనిపేట గ్రామంలోని చెరువు కాలుష్య సమస్యకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఏళ్ల తరబడి శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఇక్కడి ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న మొత్తం 120 ఓట్లకు గాను ఓటర్లందరూ ఏకగ్రీవంగా ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించారు.

2) చిత్తూరు జిల్లాలోని ఐరాల మండలం అబ్బుగుండు గ్రామానికి కనీస రహదారి సౌకర్యం, తాగునీరు, అంగన్‌వాడీ కేంద్రం వంటి కనీస వసతులు కల్పించలేదని నిరసిస్తూ ఇక్కడి ప్రజలు ఓటింగ్‌కు పూర్తిగా దూరంగా ఉన్నారు. వాటిపై హామీ ఇచ్చినా నెరవేర్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

3) అనంతపురం జిల్లాలోని నెరమెట్ల గ్రామంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఈ గ్రామానికి చెందిన ప్రజలు కూడా ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరిస్తూ సామూహిక నిర్ణయం తీసుకున్నారు. రహదారులు, తాగునీటి సౌకర్యం, ఉపాధి కల్పన వంటివాటిని పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేలు, మంత్రుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

4) అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం, గన్నేరు పుట్టు పంచాయితీ, గొప్పు గరువు, పొర్లు గ్రామాల గిరిజనులు సరైన రోడ్డు సౌకర్యం లేదని, జబ్బులు జ్వరాలు వస్తే ప్రాణాలు పోతున్నాయని, వైద్యం, విద్యా, రవాణా లేకా అవస్తలు పడుతున్న ప్రభుత్వం,అధికారులు ,ప్రజా ప్రతినిధులు పట్టించు కోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో తమ ప్రాంతానికి తారు రోడ్డు మంజూరు అయ్యేంత వరకు ఎన్నిక ల్లో పాల్గొన బోమని, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు బహిష్కరిస్తునట్లు ప్రకటించారు.

5) తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం మామిడిగుంట ఎస్సీ కాలనీ ఓటర్లు ఎప్పటి నుంచో సమీపంలోనే ఉన్న పిల్లమేడు కేంద్రంలో ఓటు వేస్తున్నారు. అయితే.. ఈసారి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న దయనేడు కేంద్రానికి మార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాదు.. అంత దూరం వెళ్లలేమంటూ.. పోలింగ్‌ను బహిష్కరించారు.

6) తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలంలోని వినాయకపురం గ్రామం: దాదాపు 40 ఏళ్లుగా కొనసాగుతున్న పోలింగ్ కేంద్రాన్ని అకస్మాత్తుగా మార్చడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు స్వచ్ఛందంగా పోలింగ్ ప్రక్రియకు దూరంగా ఉండిపోయారు.

7) అనకాపల్లి జిల్లా, అనకాపల్లి మండలంలోని రొంగలివానిపాలెం గ్రామంలో సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్‌ను తొలుత బీసీకి కేటాయించి, ఆ తర్వాత మార్పులు చేయడంపై గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ రిజర్వేషన్ల మార్పును వ్యతిరేకిస్తూ గ్రామంలోని సుమారు 800 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనకుండా బహిష్కరించారు.

'గ్రేటర్' విశాఖలో జనసేన సునామీ... !



గ్రేటర్ విశాఖలో జనసేన తన బలాన్ని గణనీయంగా పెంచుకుంది. 2021 స్థానిక ఎన్నికల్లో 58 వార్డులకు పోటీ చేసి కేవలం 3 స్థానాలే గెలిచిన పార్టీ.. తాజా మున్సిపల్ ఎన్నికల్లో 32 వార్డుల్లో పోటీ చేసి 25 చోట్ల విజయం సాధించింది. దక్షిణ విశాఖ, అనకాపల్లి, పెందుర్తి, పశ్చిమ నియోజకవర్గాల్లో మంచి ఫలితాలు సాధించింది. ఈ విజయంతో ఉత్తరాంధ్రలో పార్టీ విస్తరణకు మరింత ఊతం లభించనుందని జనసేన నేతలు భావిస్తున్నారు.

గ్రేటర్ విశాఖపట్నంలో జనసేన సునామీ సృష్టించింది. నిజానికి ఉత్తరాంధ్రపై కూటమి పట్టుబిగించింది. దీనిలో నూ జనసేన గత 2019 ఎన్నికలతో పోల్చుకుంటే.. ఇప్పుడు మరింతగా విశాఖపై పట్టు పెంచుకోవడం గమనార్హం. అప్పట్లో పవన్ గాజువాక నుంచి ఓడిపోయిన దరిమిలా.. పార్టీ పుంజుకునే విషయంపై చర్చసాగింది. పైగా అదే ఎన్నికల్లో జనసేన విశాఖ నుంచి పోటీ చేసి కూడా.. పరాజయం పాలైంది. దీంతో గ్రేటర్ విశాఖలో గ్లాసు పరిస్థితి సమస్యగా మారింది. కానీ.. అక్కడే ఇప్పుడు పార్టీ పుంజుకోవడం గమనార్హం.

వాస్తవానికి జనసేన 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ పెద్దగా పోటీ ఇవ్వలేక పోయింది. అప్పట్లో పవన్ కల్యాణ్ పోటీ చేసేవారు చేసుకోండి అనిపిలుపునిచ్చి వదిలేశారు. దీంత 58 వార్డుల్లో జనసేన నాయకులు పోటీ చేయగా.. కేవలం ముగ్గురంటే ముగ్గురు నాయకులు మాత్రమే గెలిచారు. కానీ.. దీనికి భిన్నంగా 2024 ఎన్నికల నుంచి కూడా జనసేన విశాఖలో పుంజుకోవడం ప్రారంభించింది. ఒక ఎమ్మెల్యే స్థానంతో పాటు తాజాగా జరిగిన మునిసిపల్ ఎన్నికల్లోనూ జనసేన దూకుడు చూపింది.ప్రస్తుతం మిత్రపక్షాల తరపున 32 వార్డుల్లో పోటీ చేసింది. అయితే.. కొన్ని కొన్ని మినహా అన్ని చోట్లా జనసేన విజయం దక్కించుకుంది. ఇది ఆ పార్టీకి మంచి ఊపును తెచ్చే వ్యవహారంగానే నాయకులు చెబుతున్నారు. అంతేకాదు.. భవిష్యత్తులోనూ ఉత్తరాంధ్రకు కీలకమైన గ్రేటర్ విశాఖలో పార్టీ పుంజుకునేందుకు.. మరింతగా పార్టీ విస్తరించేందుకు కూడా ఇది దోహద పడుతుందని అంటున్నారు. పైగా ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖలో పార్టీ పుంజుకోవడం ద్వారా.. అధికారంలోకి రావడం కూడా సునాయాసం అవుతుందని లెక్కలు వేస్తున్నారు.

ఎక్కడెక్కడ గెలిచారంటే..

1) విశాఖ దక్షిణంలో 8 వార్డుల్లో పోటీ చేసి 1 వార్డు మినహా మిగిలిన 7 గెలుచుకున్నారు.

2) గాజువాకలో 6 వార్డుల్లో పోటీ చేయగా, 4 చోట్ల విజయం సాధించింది.

3) అనకాపల్లి పరిధిలో 3 వార్డుల్లో పోటీ చేయగా, మూడింటిలో గెలిచింది.

4) భీమిలి పరిధిలో 3 వార్డుల్లో పోటీ చేసి రెండింటిలో గెలిచారు.

5) పెందుర్తి పరిధిలో రెండు చోట్ల పోటీ చేసిన రెండూ సొంతం చేసుకున్నారు.

6) విశాఖ తూర్పులో 4 చోట్ల పోటీ చేసి రెండు గెలిచారు.

7) పశ్చిమ నియోజకవర్గం పరిధిలో మూడు వార్డుల్లో పోటీ చేసి 3 కైవసం చేసుకున్నారు.

8) ఉత్తర నియోజకవర్గంలో 3 వార్డులు కేటాయించగా ఒకటి మినహా మిగిలిన 2 చోట్ల గెలిచారు.

'రాధా-రంగా' మిత్రమండలికి జోష్.. !



విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ 1,30,872 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన ఆయనకు 2,65,968 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మికి 1,35,056 ఓట్లు వచ్చాయి. మొత్తం 86 డివిజన్లలో కూటమి 76 స్థానాలు గెలుచుకుంది. రాధా పుట్టినరోజునే ఫలితం రావడంతో రాధా-రంగా మిత్రమండలి అభిమానుల్లో సంబరాలు నెలకొన్నాయి.
విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వంగవీటి రాధాకృష్ణ (వంగవీటి రాధా) రికార్డు స్థాయి మెజారిటీతో మేయర్‌గా ఘనవిజయం సాధించడంతో రాధా-రంగా మిత్రమండలి లో పండగ వాతావరణం నెలకొంది. సుదీర్ఘ విరామం తర్వాత వంగవీటి కుటుంబానికి లభించిన ఈ భారీ విజయం రంగా రాజకీయ వారసత్వాన్ని విజయవాడలో తిరిగి బలంగా నిలబెట్టిందని అభిమానులు మురిసిపోత్న?నారు. కూటమి తరఫున జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన వంగవీటి రాధాకృష్ణ.. తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థిని రాయన భాగ్యలక్ష్మిపై 1,30,872 ఓట్ల భారీ మెజారిటీతో విజయకేతనం ఎగురవేశారు. రాధాకృష్ణకు మొత్తం 2,65,968 ఓట్లు రాగా, రాయన భాగ్యలక్ష్మికి 1,35,056 ఓట్లు వచ్చాయి. ఇక, నవంబర్ 4న ఓట్ల లెక్కింపు పూర్తి కావడం, అదే రోజు వంగవీటి రాధాకృష్ణ పుట్టినరోజు కావడంతో అభిమానుల ఆనందం రెట్టింపయింది. కేవలం మేయర్ స్థానమే కాకుండా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మొత్తం 86 డివిజన్లలో కూటమి ఏకంగా 76 స్థానాలను కైవసం చేసుకుని ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. గత అక్టోబర్‌లో వంగవీటి రాధాకృష్ణతో పాటు రాధా-రంగా మిత్రమండలి సభ్యులు అధికారికంగా జనసేన పార్టీలో చేరారు.ఇప్పుడు సాధించిన ఈ ఘనవిజయంతో రాధా-రంగా మిత్రమండలి బెజవాడ రాజకీయాల్లో తమ పట్టును చాటుకుంది. పాతికేళ్ల వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికైన వంగవీటి రాధాకృష్ణ ప్రస్తుతం 47 ఏళ్ల వయసులో విజయవాడ మేయర్‌గా ఎన్నికయ్యారు. మరీ ముఖ్యంగా వంగవీటి మోహనరంగా 1985లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలవగా.. రంగా హత్యానంతరం 1989లో జరిగిన ఎన్నికల్లో ఆయన భార్య రత్నకుమారి అదే పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

తండ్రి కార్పొరేటర్‌గా..

వంగవీటి మోహనరంగా 1985లో ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచారు అయితే అంతకుముందు 1981లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఆయన కృష్ణలంక 40వ డివిజన్లో కార్పొరేటర్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందారు. ఇప్పుడు ఆయన కుమారుడు రాధా విజయవాడ నగరానికి మేయరుగా ఎన్నికకావడం గమనార్హం. ఇక, ఈ పరిణామంతో ఈ కుటుంబానికి అత్యంత కీలకమైన రాధా-రంగా మిత్రమండలి పుంజుకుంటుందని అనడంలో సందేహం. ఈ మిత్ర మండలి.. సేవా కార్యక్రమాలతోపాటు.. రాష్ట్ర స్థాయిలో కూడా గుర్తింపు ఉంది.

ఏపీలో పెండింగ్ మున్సిపల్ ఎన్నికలపై ఫోకస్

విజయవాడ, నవంబర్ 6, :

ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న మిగిలిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల నిర్వహణకు రాజుజ సిద్ధమవుతోంది. ఇప్పటికే మేయర్, చైర్‌పర్సన్, డిజవిన్లు, వార్డులకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఈ నెల10 నుంచి 12 మధ్య ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఈ నెల 25లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీ హైకోర్టులో కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించి కేసులు పెండింగ్ ఉన్నాయి. అందుకే అక్టోబర్ 14న జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌లో ప్రస్తావన లేదు.ఏపీ హైకోర్టులో కేసులు పరిష్కారం కావడంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే డివిజన్లు/వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితాల తయారీ పూర్తి చేశారు. అలాగే మిగిలిన ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఇటీవల రిజర్వేషన్లు కూడా ఖరారు చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం సమాచారం అందించింది. కార్పొరేషన్లలో మేయర్ పదవులకు సంబంధించి.. శ్రీకాకుళం (జనరల్ మహిళ), రాజమహేంద్రవరం (ఎస్సీ జనరల్), కాకినాడ(బీసీ మహిళ),మంగళగిరి-తాడేపల్లి (ఎస్టీ జనరల్)కి రిజర్వ్ అయ్యాయి.ఈ నాలుగు కార్పొరేషన్లకు సంబంధించి 260 డివిజన్లలో 90 స్థానాలు బీసీలకు రిజర్వ్ చేశారు. ఎస్సీలకు 35, ఎస్టీలకు 5, మహిళలకు 68, అన్ రిజర్వ్‌డ్ కింద 62 ఉన్నాయి. ఆముదాలవలస, రాజాం, భీమవరం, తాడేపల్లిగూడెం, చింతలపూడి, పాలకొల్లు, తణుకు, బి.కొత్తపేట, గుడివాడ, నరసరావుపేట, పొన్నూరు, తాడిగడప, బాపట్ల,పొదిలి, కందుకూరు, అల్లూరు, గూడూరు, కావలి, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్‌పర్సన్ స్థానాలకు ఎన్నికల నిర్వహించనున్నారు. వీటిలోని 749 వార్డులకూ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. వార్డుల్లో బీసీలకు 231, జనరల్ మహిళకు 202, ఎస్సీలకు 106,ఎస్టీలకు 36, రిజర్వ్ అయ్యాయి. మిగిలిన వార్డులు 174 వార్డులు అన్ రిజర్వ్‌డ్ అయ్యాయి. మొత్తం మీద స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ డిసెంబర్ మొదటి వారంలో పూర్తికానున్నాయి. అయితే మధ్యలో సుప్రీం కోర్టు తీర్పు, తుఫాన్ కారణంగా కొంత ఇబ్బందులు ఎదురైనా సరే ప్రక్రియ సాఫీగానే సాగిపోయింది.

వైసీపీ అంతర్గత పోరే ముంచిందా...

నెల్లూరు, నవంబర్ 6, :

రాజకీయాల్లో నెల్లూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా రాజకీయంగా బలమైన నాయకులు, రెడ్డి సామాజిక వర్గం ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతంగా నెల్లూరుకు పేరుంది. ఒకప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా కనిపించిన ఈ ప్రాంతంలో ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారినట్లు ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా జరిగిన నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి సాధించిన ఘనవిజయం వైసీపీకి గట్టి హెచ్చరికగా మారింది. పార్టీకి బలమైన నాయకత్వం ఉన్నప్పటికీ ఓటర్లను ఆకట్టుకోవడంలో ఎందుకు విఫలమైందనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే కూటమి ఆధిపత్యం ఎంత బలంగా ఉందో అర్థమవుతుంది. మొత్తం 72 డివిజన్లలో టీడీపీ(41 స్థానాలను గెలుచుకుంది. బీజేపీ ఆరు, జనసేన మూడు స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఎన్నికల ప్రక్రియ పూర్తికాకముందే ఎనిమిది డివిజన్లు కూటమి ఖాతాలో ఏకగ్రీవంగా చేరడం కూడా ఆ పార్టీకి కలిసొచ్చింది. మిగిలిన స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు మెజారిటీ విజయాలను నమోదు చేయడంతో కార్పొరేషన్‌పై పట్టు సాధించారు.ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్ మేయర్‌గా ఘన విజయం సాధించడం మరో కీలక పరిణామం. వైసీపీ అభ్యర్థి ఆనం విజయకుమార్ రెడ్డి పై ఆయన 80,170 ఓట్ల భారీ మెజారిటీ సాధించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల వ్యక్తిగత బలం, స్థానిక సమస్యలు, పార్టీ కేడర్ పనితీరు కీలకంగా ఉంటాయి. ఈ అన్ని అంశాల్లో కూటమి వైసీపీ కంటే మెరుగైన వ్యూహంతో ముందుకు వెళ్లినట్లు ఫలితాలు సూచిస్తున్నాయి.నెల్లూరులో వైసీపీకి నాయకుల కొరత లేదు. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి , పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ తో పాటు పలువురు సీనియర్ నాయకులు పార్టీకి అండుబాటులో ఉన్నారు. అయినప్పటికీ ఎన్నికల సమయంలో వీరంతా సమన్వయంతో పనిచేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాయకుల మధ్య విభేదాలు, స్థానిక స్థాయిలో ఆధిపత్య పోరు పార్టీ విజయావకాశాలను దెబ్బతీసినట్లు రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి.మరోవైపు కూటమి అభ్యర్థుల విజయానికి వైసీపీలోని కొందరు నాయకుల సహకారం కూడా కారణమైందనే ప్రచారం తెరపైకి వచ్చింది. రూప్‌కుమార్ యాదవ్‌తో కొందరు నేతలు ముందుగానే సన్నిహితంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రచారంలో వాస్తవమెంత అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఎన్నికల ఫలితాల ఆధారంగా మాత్రమే ఇలాంటి ఆరోపణలను నిర్ధారించలేం.నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం , వెంకటగిరి , సూళ్లూరుపేట వంటి మున్సిపాలిటీల్లోనూ కూటమి మంచి ఫలితాలు సాధించడం వైసీపీకి మరో ఎదురుదెబ్బగా మారింది. మొత్తానికి నెల్లూరులో వైసీపీ ఓటమిని కేవలం ప్రత్యర్థుల బలంతో మాత్రమే చూడలేం. నాయకుల మధ్య సమన్వయం, పార్టీ కేడర్ చురుకుదనం, ప్రజల్లో విశ్వాసం వంటి అంశాలు కూడా ప్రభావం చూపుతాయి. ఇప్పటికైనా అంతర్గత విభేదాలను పరిష్కరించి నాయకులందరినీ ఒకే దారిలో నడిపించకపోతే ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఫలితాలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పెన్ పవర్

సెహ్వాగ్ తనయుడి విధ్వంసం.. అండర్-19

ఆసియా కప్‌లో భారత్ శుభారంభం

నేపాల్‌పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం

ఆర్యవీర్ సెహ్వాగ్ 70 పరుగులతో అజేయ ఇన్నింగ్స్

కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీకి అర్ధశతకం

ఇషాన్ సూద్ 18 పరుగులిచ్చి మూడు వికెట్లు

ఆదివారం పాకిస్థాన్‌తో భారత్ తదుపరి మ్యాచ్



అండర్-19 ఆసియా కప్‌లో భారత యువ జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో నేపాల్‌పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ (70 నాటౌట్), కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీ (53 నాటౌట్) అర్ధశతకాలతో జట్టును గెలిపించారు. తొలుత బౌలర్లు నేపాల్‌ను 128 పరుగులకే కట్టడి చేయగా.. భారత ఓపెనర్లు లక్ష్యం చిన్నదిగా మార్చేశారు.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్‌కు ఇషాన్ సూద్ అదిరిపోయే ఆరంభం అందించాడు. కొత్త బంతితో స్వింగ్ రాబడుతూ నేపాల్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. 10 ఓవర్లలో నాలుగు మెయిడిన్లతో కేవలం 18 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. దీంతో నేపాల్ టాపార్డర్ కుప్పకూలింది. దర్శ్ సోనార్ (43) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఆశిష్ లుహార్ (29)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే వీరి భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశాక నేపాల్ లోయర్ ఆర్డర్ బ్యాటర్లు త్వరగానే పెవిలియన్ చేరారు. అర్జున్ రాజ్‌పుత్ 3, యశ్వీర్ గౌడ్ 2 వికెట్లు తీయడంతో నేపాల్ 42.3 ఓవర్లలో 128 పరుగులకు ఆలౌటైంది.స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆర్యవీర్, లక్ష్య రాయ్‌చందానీ అదిరిపోయే ఆరంభం ఇచ్చారు. తొలి కొన్ని ఓవర్లు ఆచితూచి ఆడిన ఈ జోడీ.. ఆ తర్వాత బౌండరీలతో విరుచుకుపడింది. ముఖ్యంగా నేపాల్ స్పిన్నర్లపై ఆర్యవీర్ ఎదురుదాడికి దిగాడు. క్రీజు బయటకు వచ్చి భారీ షాట్లు ఆడుతూ కేవలం 34 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మరోవైపు లక్ష్య రాయ్‌చందానీ స్ట్రైక్ రొటేట్ చేస్తూ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. అతడు 59 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. చివరకు భారత్ 19.1 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 129 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.ఈ గెలుపుతో 'గ్రూప్-ఏ'లో భారత్ రెండు పాయింట్లతో అగ్రస్థానానికి చేరింది. నెట్ రన్‌రేట్ 4.170గా నమోదైంది. భారత్ తన తదుపరి మ్యాచ్‌లో ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది.

కోహ్లీ 100 సెంచరీల కల నెరవేరేనా?

2027 ప్రపంచకప్ లోపు కష్టమంటున్న మాజీ కోచ్!

ఈ ఘనత సాధించడం కష్టమేనన్న అభిషేక్ నాయర్

ప్రపంచకప్ తర్వాత ఆడినా అతడి ఆటతీరు ఎలా ఉంటుందో అని సందేహం

వన్డేల్లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా కోహ్లీ ఇప్పటికే రికార్డు

హార్దిక్ పాండ్యాకు తోడుగా మరో ఆల్‌రౌండర్‌ను సిద్ధం చేయాలన్న నాయర్

బ్యాటింగ్ చేయగల ఇద్దరు ఆల్‌రౌండర్లు ఉంటే జట్టుకు అదనపు బలం అని వ్యాఖ్య



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీల మైలురాయిని అందుకోవాలని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే 2027 వన్డే ప్రపంచకప్‌లోపే ఈ ఘనత సాధించడం కష్టమేనని భారత జట్టు మాజీ సహాయ కోచ్ అభిషేక్ నాయర్ అభిప్రాయపడ్డాడు. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే కోహ్లీకి తగినన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉండాలని పేర్కొన్నాడు. ప్రపంచకప్ వరకు ఉన్న సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటే వంద సెంచరీల మార్కును అందుకోవడానికి సరిపడా మ్యాచ్‌లు లేవని జియోస్టార్‌తో చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి కోహ్లీ 86 సెంచరీలు చేశాడు.భారత మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారాతో కలిసి నాయర్ ఈ అంశంపై చర్చించాడు. "కోహ్లీ వంద సెంచరీలు చేయాలని నేనూ కోరుకుంటున్నా. కానీ ఆ స్థాయికి చేరుకోవాలంటే తగినన్ని మ్యాచ్‌లు ఆడాలి కదా! ప్రపంచకప్ తర్వాత కూడా అతడు ఆడొచ్చు. అయితే అప్పటికి అతడి స్ఫూర్తి ఇదే స్థాయిలో ఉంటుందా అన్నది చెప్పలేం. అందుకే ప్రపంచకప్‌లోపే ఈ ఘనత సాధించడం కష్టమని భావిస్తున్నా" అని నాయర్ వివరించాడు.వన్డేల్లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా కోహ్లీ ఇప్పటికే రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు ఈ ఫార్మాట్‌లో 55 శతకాలు బాదాడు. గతంలో సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 49 సెంచరీల రికార్డును అధిగమించాడు. 2023 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో న్యూజిలాండ్‌పై ముంబయిలోని వాంఖడే స్టేడియంలో తన 50వ వన్డే సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాడు.ఇదే చర్చలో భారత జట్టు భవిష్యత్తు కూర్పుపైనా నాయర్ కీలక సూచనలు చేశాడు. హార్దిక్ పాండ్యాకు తోడుగా మరో ఆల్‌రౌండర్‌ను సిద్ధం చేయాలని అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి పర్యటనల్లో ఇద్దరు సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్లు జట్టులో ఉంటే సమతూకం మెరుగవుతుందని చెప్పాడు. ఇద్దరు ప్రధాన పేసర్లతో పాటు బ్యాటింగ్ చేయగల ఇద్దరు ఆల్‌రౌండర్లు ఉంటే జట్టుకు అదనపు బలం చేకూరుతుందని వివరించాడు.మరోవైపు హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని నితీశ్ కుమార్ రెడ్డిని ప్రత్యామ్నాయ ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దాలని పుజారా సూచించాడు. హార్దిక్ అందుబాటులో ఉంటే అతడే తొలి ఎంపిక అని, అయితే ఏడాది పొడవునా పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండలేకపోతున్నందున సమాన సామర్థ్యాలున్న మరో ఆటగాడు అవసరమని పేర్కొన్నాడు.వన్డే క్రికెట్‌పై అభిమానుల్లో ఆసక్తి పెంచేందుకు మళ్లీ ముక్కోణపు, నాలుగు దేశాల టోర్నీలను నిర్వహించాలని నాయర్, పుజారా అభిప్రాయపడ్డారు. మూడు, నాలుగు జట్లు పాల్గొనే టోర్నీల్లో ప్రతి మ్యాచ్ కీలకంగా మారుతుందని, ఆటగాళ్లను ఎక్కువగా చూసే అవకాశం అభిమానులకు లభిస్తుందని పుజారా చెప్పాడు. ఇలాంటి పోటీలు పెద్ద టోర్నీలకు జట్లను సిద్ధం చేయడంతో పాటు వన్డే ఫార్మాట్‌పై ఆసక్తిని పెంచుతాయని నాయర్ పేర్కొన్నాడు. షార్జాలో ఆస్ట్రేలియాపై సచిన్ టెండూల్కర్ ఆడిన చారిత్రక ఇన్నింగ్స్ వంటి జ్ఞాపకాలు ఇలాంటి టోర్నీలతోనే ముడిపడి ఉన్నాయని గుర్తుచేశాడు.

బెబో స్ఫూర్తితో సైజ్ జీరోకి మారిన 'అర్జున్ రెడ్డి' బ్యూటీ



అందమైన ఆకుపచ్చ పట్టు చీరలో మెరిసిపోతున్న రాశి సింగ్



'అర్జున్ రెడ్డి'తో గుర్తింపు తెచ్చుకున్న శాలిని పాండే తన సరికొత్త స్లిమ్ లుక్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. ఇటీవల ఆమె షేర్ చేసిన డిజైనర్ ఫోటోషూట్ చిత్రాలు వైరల్‌గా మారాయి. అభిమానులు ఆమె గ్లామర్‌ను ప్రశంసిస్తున్నారు. 'మహానటి', '118', 'నిశ్శబ్దం', 'జయేశ్‌భాయ్ జోర్దార్', 'మహారాజ్' వంటి చిత్రాల్లో నటించిన శాలిని ప్రస్తుతం విభిన్న పాత్రలతో తన కెరీర్‌ను కొనసాగిస్తోంది. తెలుగు సినీ పరిశ్రమలో సంచలనం సృష్టించిన -అర్జున్ రెడ్డి- చిత్రంలో బొద్దుగా, అమాయకమైన చూపులతో లవ్లీ -ప్రీతి శెట్టి-గా కుర్రకారు హృదయాలను కొల్లగొట్టిన శాలిని పాండే ఇప్పుడు గ్లామర్ రూపురేఖలను పూర్తిగా మార్చేసింది. నాడు బాలీవుడ్ బెబో కరీనా కపూర్ ఖాన్ చూపించిన సైజ్ జీరో స్ఫూర్తితో తీవ్రంగా శ్రమించిన ఈ బ్యూటీ, బాగా స్లిమ్ అయి సరికొత్త జీరో సైజ్ అవతారంలోకి మారిపోయింది. ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ లో షేర్ చేసిన డిజైనర్ డ్రెస్ ఫోటోషూట్‌లో శాలిని అందం కవ్విస్తూ.. ట్రెండీ గ్లామర్‌తో కుర్రకారుకు నిద్రలేకుండా చేస్తోంది.ఈ సరికొత్త ఫోటోషూట్ కోసం స్టైలిస్టులు గౌర్వి దేశాయ్, నూపుర్ అభయ్ పధ్యే, హెయిర్ స్టైలిస్ట్ ప్రతీక్ష ముచండికర్, మేకప్ ఆర్టిస్ట్ సిమువా, ఫోటోగ్రాఫర్ ప్రిషా చందేల బృందం కలిసి పనిచేసింది. ఈ ఫోటోలకు శాలిని సింపుల్‌గా వర్ణనగా సింబాలిక్‌గా ఎమోజీలను క్యాప్షన్‌గా జోడించింది. కొద్ది గంటల్లోనే వైరల్‌గా మారిన ఈ పోస్ట్ కామెంట్ సెక్షన్‌లో అభిమానులు ఫైర్, హార్ట్ ఎమోజీలతో ప్రశంసల వర్షం కురిపించారు.--అందానికి ఒక పేరు ఉంటే అది కచ్చితంగా నీదే-- అంటూ నెటిజన్లు శాలిని స్టైలింగ్‌ను కొనియాడుతున్నారు.అందమైన ప్రశంసలతో పాటు.. శాలిని నటించిన ప్రాజెక్ట్‌లకు సంబంధించిన కొన్ని కామెడీ డైలాగ్‌లు కూడా కామెంట్స్‌లో రీసౌండ్ చేస్తున్నాయి. ప్రత్యేకించి --దేఖో పాపా మైనే క్యా ఉగాయా హై.. గంజా పాపా గంజా-- అనే పాపులర్ డైలాగ్‌ను గుర్తుచేసుకుంటూ.. ఆ సీన్‌తోనే తాము శాలినికి వీరాభిమానులుగా మారామని పలువురు నెటిజనులు కామెంట్లు చేశారు. మొత్తానికి.. ఈ పోస్ట్ శాలిని పాండే ఫ్యాషన్ సెన్స్, మోడర్న్ గ్లామర్ ..స్లిమ్ లుక్ స్ట్రీమ్ ప్రెజెన్స్‌ను మరోసారి చాటిచెప్పడమే కాకుండా.. సోషల్ మీడియాలో ఈ యంగ్ బ్యూటీకి ఉన్న విపరీతమైన క్రేజ్‌ను ప్రతిబింబిస్తోంది. 2017లో విజయ్ దేవరకొండ సరసన నటించిన -అర్జున్ రెడ్డి- చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి రాత్రికి రాత్రే స్టార్‌డమ్ తెచ్చుకున్న శాలిని పాండే.. ఆ తర్వాత భిన్నమైన పాత్రలను ఎంచుకుంది. -మహానటి-లో సుశీల పాత్రలో.. కల్యాణ్ రామ్ సరసన 118 అనే హిట్ మూవీలో -మేఘ-గా, అలాగే -ఎన్.టి.ఆర్. కథానాయకుడు-, -ఇద్దరి లోకం ఒకటే-, .. అనుష్క శెట్టి ద్విభాషా చిత్రం -నిశ్శబ్దం-లో కీలక పాత్రల్లో నటించి మెప్పించింది. అనంతరం తమిళంలో 100శాతం కాదల్, గోరిల్లా చిత్రాలతో అడుగుపెట్టి.. రణ్‌వీర్ సింగ్ సరసన -జయేశ్‌భాయ్ జోర్దార్ (2022)- చిత్రంతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఇటీవల ఓటీటీ మూవీ -మహారాజ్ (2024)- లో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది.

ప్రస్తుతం శాలిని పాండే కెరీర్ ఎలా ఉంది? రేసులో వెనకబడిందా?

తొలి సినిమా -అర్జున్ రెడ్డి- సాధించిన భారీ విజయం తర్వాత శాలిని పాండే టాలీవుడ్‌లో హీరోయిన్‌గా వరుస ఆఫర్లు అందుకుంది. కానీ బాలీవుడ్ లో బిజీ అయ్యాక తెలుగులో కొంతవరకు వెనకబడినట్లు కనిపిస్తోంది. టాలీవుడ్ లో క్రేజీ ప్రాజెక్ట్‌లు చేయలేకపోయినా.. సౌత్ నుండి బాలీవుడ్ వరకు కథాబలం ఉన్న విభిన్న పాత్రలను ఎంచుకుంటూ తన ఉనికిని చాటుకుంటోంది. ప్రస్తుతం సరికొత్త జీరో సైజ్ మేకోవర్‌తో మరింత గ్లామరస్‌గా తయారైన శాలిని పాండే.. మళ్లీ మునుపటి జోరు అందుకుంటుందో లేదో చూడాలి.

వామికా గబ్బి నల్ల చీర ఫోటోలు కాలాతీతమైన సాంప్రదాయ సొబగును ప్రదర్శిస్తున్నాయి



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com